జాతీయ వార్తను ఈ-పేపర్‌లోనూ,
డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.జాతీయవార్త.కామ్‌లో
కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..

జాతీయ **వార్త** తెలుగు దినపత్రిక

మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ **వార్త** తెలుగు దిన పత్రికలో ప్రచురిస్తాం. మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

మంగళవారం | 23-12-2025 | శ్రీకాకుళం | సంపుటి: 2 సంచిక: 546 పేజీలు: 4 వెల : రూ.7

# యమ కంకరులు!



* పలాస, మందస మండలాల్లో బరితెగించి కంకర మాఫియా
* రాత్రివేళ యంత్రాలతో తవ్వేస్తున్న కొండలను తవ్వేస్తున్న మాఫియా
* ప్రభుత్వ ఆదాయానికి గండి
* శాఖల వారీగా వాటాలు వెళుతున్న వైనం
* కన్నెత్తి చూడని మైనింగ్, రెవెన్యూ, పోలీసు అధికారులు








**శ్రీకాకుళం, డిసెంబరు22 (వార్త):** పలాస నియోజకవర్గంలో కంకర కొండలు కనుమరుగవుతున్నాయి. రాత్రివేళ పెద్ద ఎత్తున యంత్రాలతో తవ్వకాలు చేస్తూ లారీలతో తరలిస్తున్నారు. కంకర మాఫియా ఒక్కటిగా మారి రాత్రి ఎనిమిది నుంచి ఉదయం ఐదు గంటల వరకూ కొండలను తవ్వేస్తున్నారు. ఆయా ప్రాంతాలకు ఇతరులు ఎవరూ రాకుండా తమ అనుచరులను కాపలాగా ఉంచుతున్నారు. కొత్తవారు ఎవరైనా అటువైపుగా వెళితే అడ్డుకోవడమే గాకుండా బెదిరింపులకు పాల్పడుతున్నారు. పలాస మండలంలోని వీరరామచంద్రపురం, మందస మండలంలోని పిడి మందస, తదితర ప్రాంతాల్లో కంకర కొండలు ఎక్కువగా ఉన్నాయి. అధికార పార్టీ నేతల కనుసన్నల్లోనే ఈ కంకర తవ్వకాలు జరుగుతుండడంతో కొందరు రెవెన్యూ, మైనింగ్ అధికారులు పట్టించుకోవడం లేదు. మరికొందరికి వాటాలు అందుతుండడంతో అటుగా కన్నెత్తి చూడడం లేదు. కంకర కొండలు తవ్వాలంటే పంచాయతీల అనుమతి ఉండాలి. ఎటువంటి అనుమతులు తీసుకోకపోవడం, ఒక కొండకు అనుమతి తీసుకుని, మరిన్ని కొండల్లో గ్రావెల్‌ను కంకర మాఫియా తవ్వేస్తూ, ఇతర ప్రాంతాలకు తరలిస్తూ లక్షలకు లక్షలు జేబుల్లో వేసుకుంటోంది. ప్రభుత్వ ఆదాయానికి గండిపడుతున్నా యంత్రాంగం మాత్రం చోద్యం చూస్తోంది. ఇదిలా కొనసాగితే భవిష్యత్‌లో జిల్లాలో కంకర కొండలు కనుమరుగయ్యే పరిస్థితి ఉందని పర్యావరణ వేత్తలు చెబుతున్నారు.



## చోరీ కేసు ఛేదింపు

**శ్రీకాకుళం క్రైం, డిసెంబరు 22(వార్త):** ఎచ్చెర్ల పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన గొలుసు దొంగతన కేసును పోలీసులు ఎట్టకేలకు ఛేదించారు. నిందితుడిని అరెస్టు చేసి సుమారు 5తులాల బంగారు ఆభరణాలు, ఒక పల్సర్ ద్విచక్ర వాహనంను స్వాధీనం చేసుకున్నారు. దీనికి సంబంధించిన వివరాలను శ్రీకాకుళం డీఎస్పీ సీహెచ్ వివేకానంద సోమవారం మీడియాకు వెల్లడించారు. 2024 జూన్16న రాత్రి ఆరు గంటల సమయంలో ఎచ్చెర్ల మండలం, రామనగర్ కళ్లాలు వద్ద నెతింటి సూరమ్మ పొలానికి వెళ్లి వస్తుండగా ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు వచ్చి ఆమె మెడలో ఉన్న తులం బంగారు పుస్తెల తాడును లాక్కోవడానికి ప్రయత్నించాడు. బాధితురాలు పుస్తెలను గట్టిగా పట్టుకోవడంతో పుస్తెలు ఆమె చేతిలోనే ఉండగా, తాడును వారు తెంపుకొని పోయారు. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎచ్చెర్ల పోలీసులు కేసు నమోదు చేశారు. సాంకేతిక పరిజ్ఞానం, పాత నేరస్తుల కదలికల ఆధారంగా ఈ కేసును పోలీసులు ఛేదించారు. ఒడిశాకు చెందిన వుల వినోద్ ఈ చోరీకి పాల్పడినట్టు గుర్తించారు. ఈనెల 22న మధ్యాహ్నం అతడిని చిలకపాలెం వద్ద పోలీసులు పట్టుకున్నారు. గతంలోనూ చాలా వరకూ దొంగతనాలకు పాల్పడ్డాడని డీఎస్పీ తెలిపారు. మేకల గణేశ్ అనే వ్యక్తితో కలిసి రణస్థలం, మందస, ఎచ్చెర్ల, నందిగం, కశింకోట (అనకాపల్లి జిల్లా) పోలీస్ స్టేషన్ పరిధుల్లో పలు చైన్‌స్నాచింగ్‌కు పాల్పడ్డాడని తెలిపారు. అలాగే మరికొన్ని దొంగతనాల్లోనూ ఇతని పాత్ర ఉందని చెప్పారు. కేసు ఛేదించిన సీఐ ఎం.అవతారం, ఎస్ఐ జి.లక్ష్మణరావు, హెచ్‌సీ రమణయ్య, కానిస్టేబుళ్లు రవికుమార్, శంకర్, దివాకర్, హేమంతకుమార్‌ను ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి అభినందించారు.

## గంజాయి స్వాధీనం

**నరసన్నపేట, డిసెంబరు 22 (వార్త):** మడపాం టోల్‌ప్లాజా వద్ద సోమవారం నరసన్నపేట పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా ఓ వ్యక్తి వాహనంపై అనుమానాస్పదంగా వెళుతుండడాన్ని గమనించారు. అతని వద్ద ఉన్న బ్యాగులను తనిఖీ చేయగా 2.180 కేజీల బరువు గల గంజాయి కనిపించింది. అతనిపై కేసు నమోదు చేసినట్టు నరసన్నపేట సీఐ ఎం.శ్రీనివాసరావు తెలిపారు.

# పాతపట్నం నియోజకవర్గంలో..
# టీడీపీకి ఝలక్!



* గ్రూపుల గోలతో పార్టీలో ఉండలేమంటున్న కొందరు తెలుగు తమ్ముళ్లు
* టీడీపీని వీడి రెడ్డి శాంతి సమక్షంలో వైసీపీలోకి పెద్ద ఎత్తున చేరికలు
* త్వరలో ఇంకొంతమంది చేరే అవకాశం
* తమ కష్టాన్ని గుర్తించడం లేదని కొందరు
* నాయకత్వ లోపం కారణమంటున్న మరికొందరు
* నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో ఇదే పరిస్థితి
* పట్టించుకోని పార్టీ జిల్లా అధిష్టానం
* అవకాశాలను అందిపుచ్చుకుంటున్న వైసీపీ నేతలు

**కొత్తూరు, డిసెంబరు22 (వార్త):** పాతపట్నం నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీలో ఎదురు గాలి వీయడం మొదలైంది. నాయకత్వ లోపం, అంతర్గత విభేదాలు, గ్రూపులతో భగ్గుమంటోంది. ఒక గ్రూపును బలహీనం చేసేందుకు మరో గ్రూపు పనిచేస్తోంది తప్ప కలిసివెళ్లేలా ఎటువంటి చర్యలు చేపట్టడం లేదు. దీంతో ఏ గ్రామానికి వెళ్లినా కలమట వర్గం, మామిడి వర్గం అంటూ రెండుగా చీలిపోయింది. పార్టీ, ప్రభుత్వ కార్యక్రమాలను సైతం ఎవరికి వారుగా చేసుకుంటున్నారు. ఇటీవల ఎంఎంఎస్ ఎన్నికల్లో కూడా రెండు వర్గాలకు చెందిన నేతలు బహిరంగంగానే కొట్టుకున్నారు.



పార్టీని ఏకతాటిపైకి నడిపించే సమర్ధులై నాయకులు టీడీపీలో ఉన్నా వారే కొంతమేర పొగపెడుతున్నారు. సీనియర్లను ఎమ్మెల్యే పక్కనపెట్టడంతో వారు మౌనం దాలుస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. దీంతో పార్టీని నమ్ముకుని ఉన్న కొందరు నేతలు, కార్యకర్తలు ఇతర పార్టీల వైపు చూస్తున్నారు. నియోజకవర్గంలో వైసీపీ సైతం బలంగా ఉంది. ఆ పార్టీకి సైతం మంచి నాయకులు ఉన్నారు. ప్రస్తుతం వారంతా నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీలో పరిస్థితిని గమనిస్తున్నారు.

అవకాశం వచ్చినప్పుడల్లా టీడీపీ శ్రేణులను వైసీపీలోకి లాగేస్తున్నారు. వైసీపీ అధినేత వైఎస్ జగన్మోహనరెడ్డి జన్మదిన వేడుకలు సందర్భంగా పెద్ద ఎత్తున టీడీపీ నాయకులు, కార్యకర్తలు మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి సమక్షంలో వైసీపీలో చేరారు. వారికి స్వయంగా రెడ్డి శాంతి పార్టీ కండువా వేసి ఆహ్వానం పలికారు. ఎవరు వచ్చినా స్వాగతం పలుకుతున్నారు. కొత్తూరు మండలంలోని ఒండ్రుజోల గ్రామంలో మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి సమక్షంలో జరిగిన జగన్మోహనరెడ్డి పుట్టినరోజు వేడుకలలో టీడీపీకి చెందిన సుమారు 30 కుటుంబాలు వైసీపీ తీర్థం పుచ్చుకున్నాయి. ఇలా నియోజకవర్గంలో పలుచోట్ల ఇదే పరిస్థితి కనిపించింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర కూడా కాకముందే.. పాతపట్నంలో టీడీపీకి వ్యతిరేక పవనాలు బలంగా వీస్తున్నాయని విశ్లేషకులు భావిస్తున్నారు. చాలా మంది నేతలు స్థానిక సంస్థల ఎన్నికల కోసం ఎదురుచూస్తున్నారు. నియోజకవర్గంలో ఇప్పుడే పరిస్థితి ఇలా ఉంటే, 2029 ఎన్నికల నాటికి పార్టీ పరిస్థితి ఏంటి?" అని స్వయంగా ఆ పార్టీ నాయకులే గుసగుసలాడుకుంటున్నారు.

జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## అట్రాసిటీ బాధితులకు అండగా ఉండాలి

**శ్రీకాకుళం, డిసెంబరు 22 (వార్త):** ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం కింద నమోదైన కేసుల్లో బాధితులకు ప్రభుత్వం నుంచి అందాల్సిన పరిహారం, ఉద్యోగ నియామకాలను సత్వరమే పూర్తి చేసి వారికి భరోసా కల్పించాలని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సమీక్షా సమావేశం నిర్వహించారు. జిల్లా ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డితో కలిసి కలెక్టర్ ఈ సమావేశంలో గత అక్టోబరు నెలలో తీసుకున్న నిర్ణయాల అమలు తీరును సమీక్షించారు. బాధితులకు న్యాయం చేయడంలో అలసత్వం వహించకూడదని కలెక్టర్ స్పష్టం చేశారు. 2017 నుంచి 2025 వరకు జిల్లాలో నమోదైన 12 హత్యా కేసుల్లో, బాధిత కుటుంబ సభ్యుల విద్యార్హతలను బట్టి 12 మందికి వివిధ ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించామని ఆయన వివరించారు. భూ వివాదాలను త్వరితగతిన పరిష్కరించి బాధితులకు న్యాయం చేయాలన్నారు. తదుపరి సమావేశం నాటికి ప్రస్తుత నిర్ణయాలపై తీసుకున్న చర్యల నివేదికను సిద్ధం చేయాలని జిల్లా రెవెన్యూ అధికారిని ఆదేశించారు. జిల్లా ఎస్పీ మహేశ్వరరెడ్డి మాట్లాడుతూ.. ప్రస్తుతం జిల్లాలో పలు కేసులు దర్యాప్తులో ఉన్నాయని, వాటిని వేగంగా పూర్తి చేయాలని పోలీస్ అధికారులకు సూచించారు. పలు స్టేషన్ హౌస్ ఆఫీసర్లను ఈ సందర్భంగా ఆదేశిస్తూ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యుల నుంచి వచ్చే వినతులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. సమావేశంలో పలువురు సభ్యులు క్షేత్రస్థాయి సమస్యలను కలెక్టర్ దృష్టికి తెచ్చారు. రిమ్స్ ఆసుపత్రి అవుట్‌సోర్సింగ్ పోస్టుల్లో రోస్టర్ పద్ధతి పాటించాలని, అక్కడ పారిశుధ్యాన్ని మెరుగుపరచాలని కోరారు.



## క్రమ'శిక్షణ' అవసరం

*** జిల్లా ఎస్పీ కేవీ మహేశ్వర రెడ్డి * జిల్లా పోలీస్ శిక్షణ కేంద్రంలో ఎస్‌సీటీపీసీ కానిస్టేబుల్ శిక్షణ ప్రారంభం**

**శ్రీకాకుళం, డిసెంబరు22 (వార్త):** శిక్షణ సమయంలో చట్టాలపై సంపూర్ణ అవగాహన పెంచుకోవాలని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి అన్నారు. క్రమశిక్షణ, నిబద్ధత, శారీరక దృఢత్వంతో పాటు సాంకేతిక నైపుణ్యం, ప్రజల పట్ల సేవాభావమే అత్యంత ముఖ్యమని తెలిపారు. సోమవారం జిల్లా పోలీస్ శిక్షణ కేంద్రం తండేవలసలో నూతనంగా పోలీస్ కానిస్టేబుళ్లుగా ఎంపికైన స్టైపెండియరీ క్యాడెట్ ట్రెయినీ పోలీస్ కానిస్టేబుల్స్ (ఎస్‌సీటీపీసీ)గా రాజమండ్రి, కృష్ణా జిల్లాలకు చెందిన 145 మంది అభ్యర్థులకు శిక్షణ కార్యక్రమం ప్రారంభమైంది. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. నూతనంగా ఏర్పాటు చేసిన కంప్యూటర్ ల్యాబ్‌ను ప్రారంభించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ సమయాన్ని వృథా చేయకుండా శిక్షణ కాలాన్ని అత్యంత విలువైనదిగా భావించాలన్నారు. పోలీస్ ఉద్యోగం గౌరవప్రదమైన బాధ్యత అని తెలిపారు. పోలీస్ ఉద్యోగం కేవలం ఉపాధి మాత్రమే కాకుండా ప్రజల భద్రత, శాంతి భద్రతల పరిరక్షణకు అంకితమైన సేవా వృత్తి అని పేర్కొన్నారు. శిక్షణ పొందుతున్న ట్రెయినీలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని క్రమశిక్షణ, నిబద్ధత, నిజాయితీ, ధైర్యం వంటి లక్షణాలను జీవితంలో అలవర్చుకోవాలని సూచించారు. ప్రజల విశ్వాసమే పోలీస్ విభాగానికి మూలస్తంభమని, ప్రజలతో స్నేహపూర్వకంగా మెలుగుతూ చట్టాన్ని సమర్థవంతంగా అమలు చేయాల్సిన బాధ్యత పోలీసులపై ఉందని స్పష్టం చేశారు. పోలీస్ ఉద్యోగం గౌరవప్రదమైనదే కాకుండా సవాళ్లతో కూడుకున్నదని, పని ఒత్తిడి మధ్యన కూడా చట్టబద్ధత, నైతిక విలువలు, మానవత్వాన్ని ఎప్పటికీ వదలకూడదని హితవు పలికారు. ప్రతి పోలీస్ సిబ్బంది ప్రజల దృష్టిలో నమ్మకమైన రక్షకుడిగా నిలవాలని, పోలీస్ యూనిఫాం గౌరవాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని తెలిపారు. ఏవైనా సమస్యలు ఉంటే నేరుగా సంప్రదించాలని సూచించారు. అదనపు ఎస్పీ (ట్రైనింగ్ సెంటర్ ప్రిన్సిపాల్) కె.వి. రమణ మాట్లాడుతూ సైబర్ నేరాలు ప్రస్తుత సమాజంలో పెద్ద సవాలుగా మారాయని, సాంకేతికతను అందిపుచ్చుకొని అందుకు తగిన శిక్షణ పొందాలన్నారు. అదనపు ఎస్పీ (క్రైమ్) పి.శ్రీనివాసరావు మాట్లాడుతూ తొమ్మిది నెలల శిక్షణ కాలాన్ని క్రమశిక్షణతో సద్వినియోగం చేసుకొని ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా అధ్యయనం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీలు సి.హెచ్.వివేకానంద, శేషాద్రి, గోవిందరావు, ఏవో సి.హెచ్. గోపీనాథ్, సీఐలు, ఇతర పోలీస్ అధికారులు, యూనిట్ మెడికల్ అధికారి, కార్యాలయ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## మాదక ద్రవ్యాలపై పోరాటంలో యువత భాగస్వాములు కావాలి

*** గంజాయి అక్రమ రవాణాను నిరోధిద్దాం * పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు**
*** అభ్యుదయం సైకిల్ యాత్రలో నేతలు, అధికారులు**

**శ్రీకాకుళం డిసెంబర్ 22(వార్త):** ఆంధ్రప్రదేశ్‌ను డ్రగ్స్ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాల్లో భాగంగా, పోలీస్ శాఖ ఆధ్వర్యంలో పాయకరావుపేట నుండి ఇచ్ఛాపురం వరకు చేపట్టిన అభ్యుదయ సైకిల్ యాత్ర సోమవారం పాతపట్నం చేరింది. ఈ యాత్ర బృందానికి పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు స్వాగతం పలికారు. అచ్యుతాపురం నుండి స్థానిక కోర్టు కూడలి వరకు నిర్వహించిన భారీ సైకిల్ ర్యాలీలో ఎమ్మెల్యే ఉత్సాహంగా పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మాదక ద్రవ్యాలు వ్యక్తిని మాత్రమే కాదు, కుటుంబాన్ని, సమాజాన్ని పూర్తిగా నాశనం చేస్తాయ న్నారు. డ్రగ్స్ వ్యతిరేక ఉద్యమంలో యువత, విద్యా ర్థులు ముందుండి పోరాడాలని పిలుపునిచ్చారు.




డ్రగ్స్ నిర్మూలనకు తమ పూర్తి మద్దతు ఉంటుందన్నారు. ప్రజలు ఎక్కడైనా డ్రగ్స్ అక్రమ రవాణా, వినియోగంపై సమాచారం ఉంటే ఆంధ్రప్రదేశ్ పోలీస్ శాఖ టోల్ ఫ్రీ నెంబర్ 1972కు సమాచారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టెక్కలి డీఎస్పీ ఎల్.లక్ష్మణరావు, పాతపట్నం కొత్తూరు సర్కిల్ ఇన్స్పెక్టర్స్, పాతపట్నం, కొత్తూరు సబ్ ఇన్స్పెక్టర్లు, ఐదు మండలాలకు చెందిన కూటమి నాయకులు, కార్యకర్తలు, విద్యార్థులు, యువత, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.





## ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజనీర్స్ నూతన కమిటీ ఎన్నిక

**శ్రీకాకుళం, డిసెంబరు 22 (వార్త):** జాతీయ స్థాయి సంస్థ ఇని స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీర్స్ శ్రీకాకుళం చాప్టర్ నూతన చైర్మన్‌గా వాటర్ రిసోర్స్ క్వాలిటీ కంట్రోల్ ఎస్ఈ డోల తిరుమలరావు, కార్యదర్శిగా ఐతం కళాశాల ప్రొఫెసర్ జి.నాగేశ్వరరావు ఎన్నికయ్యారు. శ్రీకాకుళం నగరంలోని హోటల్ గ్రాండ్‌లో ప్రస్తుత చైర్మన్ ప్రొఫెసర్ డి.విష్ణుమూర్తి అధ్యక్షతన కార్యవర్గ సమా వేశం సోమవారం జరిగింది. నూతన కార్యవర్గ ఎన్నిక పరిశీలకులు ముని శ్రీని వాస్, చింతాడ రాజశేఖర్ పర్యవేక్షణలో నూతన కమిటీ 15 మందిని ఎన్ను కున్నారు. ఈ సందర్భంగా విష్ణుమూర్తి మాట్లాడుతూ శ్రీకాకుళం జిల్లా అభి వృద్ధిలో ఇంజనీర్లు పాత్ర కీలకమన్నారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన వారికి అభినందనలు తెలిపారు. నూతన చైర్మన్ డోల తిరుమలరావు మాట్లాడుతూ ఇని స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీర్స్ శ్రీకాకుళం చాప్టర్ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజనీర్ ప్రతినిధులు డాక్టర్ ఎస్.నాగరాజు, హారికాప్రసాద్, వి.పాపారావు, సి.హెచ్.రమేష్, బి.సంతోష్ కుమార్, హెచ్.మన్మధరావు, కె.శ్రీనివాసరావు, డాక్టర్ సౌజన్యవాణి, డాక్టర్ బి.భూషణ్‌రత్, ఎల్.సాయిశంకర్‌దీక్షిత్, ఎస్.రుషి, ఎస్.హరీష్‌కుమార్, వెంకట రావు తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయికి ఎంపిక అభినందనీయం



**శ్రీకాకుళం, డిసెంబరు 22 (వార్త):** శ్రీకాకుళం ప్రభుత్వ మహిళ డిగ్రీ కళాశాల ఆవరణలో జిల్లా స్థాయి కౌశల్ విజేతలకు బహుమతులను ప్రదా నం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డీఈవో ఎ.రవిబాబు పాల్గొని మాట్లాడారు. జాతీయ స్థాయి వేదికైన కౌశల్ ప్రతిభా పరీక్షలో శ్రీకాకుళం జిల్లా నుండి 12మంది విద్యార్థులు రాష్ట్రస్థాయికి ఎంపిక కావడం అభినందనీయ మన్నారు. ప్రిన్సిపాల్ కె.సూర్యచంద్రరావు మాట్లాడుతూ నేటి సమాజంలో సైన్స్, గణితం కౌశలాలను బాగా అర్థం చేసుకుంటే విద్యార్థి భవిష్యత్తులో మంచి లక్ష్యా లను చేరుకోవచ్చన్నారు. జిల్లా కౌశల్ సమన్వయ అధికారి అల్లు అప్పన్న మాట్లా డుతూ ఈ పోటీల వల్ల విద్యార్థులలో ఆత్మవిశ్వాసం, సమస్య పరిష్కార నైపు ణ్యంతో కూడిన సృజనాత్మక ఆలోచనలు పెంపొందుతాయని తెలిపారు. కార్యక్ర మంలో జిల్లా అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ పి.చంద్రభూషణ్, డీసీఈ సెక్రటరీ ఎ.సంజీవరావు, జిల్లా కోఆర్డినేటర్ ఎ.అప్పన్న జాయింట్ కోఆర్డినేటర్ జీవీ రమణ, జిల్లా పరిశీలకులు ఎ.పున్నయ్య, గైడ్ టీచర్లు, విద్యార్థులు, తల్లి దండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## గ్రీవెన్స్ అర్జీలను సత్వరమే పరిష్కరించాలి

*** జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్**
*** ఒకేరోజు 193 వినతులు**

**శ్రీకాకుళం, డిసెంబరు 22 (వార్త):** ప్రజా ఫిర్యాదుల నమోదు మరియు పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)కు వచ్చే అర్జీలను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించి బాధితులకు న్యాయం చేయాలని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించిన గ్రీవెన్స్ కార్యక్రమంలో ఆయన పాల్గొని అర్జీదారుల నుండి స్వయంగా వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్షేత్రస్థాయిలో సమస్యల తీవ్రతను బట్టి అధికారులు స్పందించాలని, గడువులోగా నాణ్యమైన పరిష్కారం చూపాలని స్పష్టం చేశారు. సోమవారం సాయంత్రం 5 గంటల వరకు ఆన్‌లైన్ ద్వారా జిల్లా వ్యాప్తంగా మొత్తం 193 ఫిర్యాదులు నమోదయ్యాయి. ఈ వినతుల్లో అత్యధికంగా సెర్ప్ శాఖకు సంబంధించి 61 అర్జీలు రాగా, రెవెన్యూ శాఖకు 44, పంచాయతీ రాజ్ శాఖకు 15, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ విభాగంలో 10 వినతులు అందాయి. అలాగే వ్యవసాయం (8), పోలీస్ (5), గ్రామీణాభివృద్ధి (5), పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ (5) శాఖలపై ప్రజలు తమ సమస్యలపై వినతి



పత్రాలు అందజేశారు. హౌసింగ్, సర్వే సెటిల్మెంట్స్, ఏపీ టిడ్కో, విద్యుత్ శాఖ, పాఠశాల విద్యాశాఖతో పాటు మొత్తం 30 వివిధ విభాగాలకు చెందిన సమస్యలను అర్జీదారులు జాయింట్ కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. ప్రజా సమస్యల పట్ల నిర్లక్ష్యం వహించకుండా, సంబంధిత శాఖాధికారులు ఎప్పటి కప్పుడు నివేదికలు సమర్పించాలని ఈ సందర్భంగా జేసీ ఆదేశించారు. డిఆర్ఓ ఎస్‌వి లక్ష్మణ మూర్తి, ప్రత్యేక అధికారి వెంకటేశ్వరరావు, డిఆర్‌డిఏ పీడీ కిరణ్ కుమార్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ పద్మావతి తదితర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

### 37 వినతులు స్వీకరణ

ప్రజా ఫిర్యాదులు చట్ట పరిధిలో పరిష్కారం చూపిస్తామని అదనపు ఎస్పీ (క్రైమ్) పి.శ్రీనివాసరావు తెలిపారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల



## ఆరోగ్య పరిరక్షణ అందరి బాధ్యత

**శ్రీకాకుళం, డిసెంబరు 22 (వార్త):** ప్రజలు ఆర్థిక ఇబ్బందుల వల్ల వైద్యానికి దూరం కాకూడదని, మెరుగైన ఆరోగ్య సేవలు అందరికీ అంద డమే 'విశ్వజనీన ఆరోగ్య పరిరక్షణ దినోత్సవం' ముఖ్య ఉద్దేశమని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ (డీఎల్ఎస్ఏ) కార్యదర్శి కె. హరిబాబు పేర్కొన్నారు. సోమ వారం సింగుపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు, జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా సూచనలతో ఈ కార్యక్రమం నిర్వహించారు. వైద్య ఖర్చుల భారం వల్ల ఏటా అనేక కుటుంబాలు తీవ్ర పేదరికంలోకి కూరుకు పోతున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తూ, ప్రజలు తమ ఆరోగ్యం పట్ల ముందస్తు శ్రద్ధ వహించాలని సూచించారు. ఆసుపత్రికి వచ్చే రోగుల పట్ల వైద్య సిబ్బంది నిబద్ధతతో వ్యవహరించి, మానవీయ కోణంలో సేవలందించాలని హరిబాబు కోరారు. క్షేత్రస్థాయిలో ఏఎన్ఎంలు, ఇతర అధికారులు నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ ఆరోగ్య పథకాలపై అవగాహన కల్పించాలన్నారు. ప్రపంచ జనాభాలో సగం మందికి ఇప్పటికీ కనీస వైద్య సేవలు అందకపోవడం శోచనీయమని, ఈ పరిస్థితిలో మార్పు రావాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాది జి. ఇందిరా ప్రసాద్, పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ లిల్లీ, వైద్య సిబ్బంది, రోగులు పాల్గొన్నారు.

## రాష్ట్రాభివృద్ధికి విద్యుత్ రంగం కీలకం

*** రాష్ట్ర పీయూసీ చైర్మన్, ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ * విద్యుత్ రంగ అభివృద్ధిపై సమీక్ష సమావేశం**



**శ్రీకాకుళం, డిసెంబరు 22 (వార్త):** రాష్ట్ర అభివృద్ధికి విద్యుత్ రంగం కీలకమని, ప్రజలకు నిరంతరం నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర పీయూసీ చైర్మన్, ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ తెలిపారు. ఇందుకు అనుగుణంగా అధికారులు సమన్వయంతో పనిచేసి నిర్ణీత లక్ష్యాలను సాధించాలని సూచించారు. అమరావతిలోని విద్యుత్ సౌధలో ఏపీ ట్రాన్స్‌కో అధికారులతో విద్యుత్ రంగం అభివృద్ధిపై సోమవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. విద్యుత్ రంగంలో అమలు చేస్తున్న పథకాలు, ప్రస్తుత పనితీరు, భవిష్యత్ కార్యాచరణపై విస్తృతంగా చర్చించారు. విద్యుత్ సరఫరా నాణ్యతను మెరుగుపర్చడం, నష్టాలను తగ్గించడం, వినియోగదారులకు మెరుగైన సేవలు అందించేందుకు అవసరమైన చర్యలపై అధికారులు వివరాలు వెల్లడించారు. సమావేశంలో శాసనసభ్యులు వసంత్ కృష్ణ ప్రసాద్, తెనాలి శ్రావణ్ కుమార్, గౌతు శిరీష, విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## రైతన్నకు అందుబాటులో యూరియా

**శ్రీకాకుళం, డిసెంబరు 22 (వార్త):** జిల్లాలో రబీ పంటల సాగు ముమ్మరమవుతున్న తరుణంలో రైతులకు అవసరమైన యూరియాను పంపిణీకి సిద్ధం చేసినట్లు జిల్లా వ్యవసాయ అధికారి త్రినాధ స్వామి తెలిపారు. రబీ 2025-26 సీజన్‌లో సాగవుతున్న మొక్కజొన్న, వరి, ఇతర పంటల అవసరాలకు అనుగుణంగా యూరియాను కేటాయించామని ఆయన పేర్కొన్నారు. పంట విస్తీర్ణాన్ని ప్రాతిపదికగా తీసుకుని ప్రతి మండలంలోనూ నిల్వలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నట్లు స్పష్టం చేశారు. ప్రస్తుతం జిల్లావ్యాప్తంగా ఉన్న రిటైల్ కేంద్రాలలో 2379 మెట్రిక్ టన్నుల యూరియా నిల్వ ఉందని త్రినాధ స్వామి వివరించారు. రైతు సేవా కేంద్రాలు (ఆర్బీకేలు), పి.ఏ.సి.ఎస్/డి.సి.ఎం.ఎస్ మరియు ప్రైవేటు డీలర్ల ద్వారా ఈ ఎరువులను రైతులకు సజావుగా సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. రైతులు తమకు సమీపంలోని ఈ కేంద్రాలను సంప్రదించి, అవసరమైన మేరకు యూరియాను పొంది సాగు పనుల్లో నిమగ్నం కావాలని సూచించారు.

# వాజ్‌పేయ్ లక్ష్యం మోదీతోనే సాధ్యం

*** నేటి గ్లోబల్ గుర్తింపునకు బీజం వేసింది వాజ్‌పేయ్ * కోటి ఫేక్ సంతకాలు వారివైతే.. వేల కోట్ల మంది ఆప్యాయతలు మావి * కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు * భీమవరంలో వాజ్‌పేయి విగ్రహావిష్కరణ**

**శ్రీకాకుళం, డిసెంబరు 22 (వార్త):** పశ్చిమ గోదావరి జిల్లా భీమవరంలో మాజీ ప్రధాన మంత్రి, భారత రత్న, అటల్ బిహారీ వాజ్‌పేయి విగ్రహావిష్కరణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కేంద్ర పౌర విమానయాన శాఖామంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు పాల్గొన్నారు. తొలుత జరిగిన రోడ్ షో కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర అధ్యక్షులు మాధవ్, కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మ, రాష్ట్ర మంత్రి సత్యకుమార్ యాదవ్, ఉపసభాపతి రఘురామ కృష్ణం రాజు, ఎమ్మెల్యేలు పితాని సత్యనారాయణ, రాధాకృష్ణ, అంజిబాబు తదితర నాయకులు పాల్గొన్నారు. అనంతరం వాజ్ పేయ్ విగ్రహాన్ని ఆవిష్కరించి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ వాజ్‌పేయి విగ్రహావిష్కరణ కార్యక్రమంలో పాల్గొనే అవకాశం రావడం ఆనందకరమన్నారు. అటల్ బిహారీ వాజ్‌పేయి, నా తండ్రి ఎర్రంనాయుడుల మధ్య ఎప్పటి నుండి మంచి సంబంధాలు ఉన్నాయని తెలిపారు. వాజ్‌పేయి గారి జీవిత చరిత్ర ప్రతి భారత పౌరుడికి పాఠ్యాంశమని తెలిపారు. నరేంద్ర మోదీ నాయకత్వంలో భారతదేశానికి లభిస్తున్న గ్లోబల్ గుర్తింపునకు పునాది వేసిన దూరదృష్టి గల నాయకుడు వాజ్‌పేయి అని చెప్పారు. వాజ్‌పేయి దేశానికి మొట్టమొదటి కాంగ్రెసేతర ప్రధానిగా చరిత్ర సృష్టించారన్నారు. ఆయన నీతి, విలువలకు కట్టుబడి జరిపిన రాజకీయాలు నేటి తరానికి ఆదర్శమన్నారు. దేశ అభివృద్ధి వేగవంతం చేయడానికి వాజ్‌పేయి స్వర్ణ చతుర్భుజ ప్రాజెక్టు, ప్రధాన మంత్రి గ్రామీణ సడక్ యోజన వంటి పథకాల ద్వారా గ్రామాలు, పట్టణాల మధ్య అనుసంధానం పెంచారన్నారు. భారతదేశాన్ని అణు శక్తి దేశంగా నిలబెట్టే ధైర్య



నిర్ణయాలు తీసుకున్నారని పేర్కొన్నారు. శ్రీకాకుళం నుండి అనంతపురం వరకు ప్రతీ వ్యక్తి అభివృద్ధి సాధించాలన్న తపనతో ప్రధాని నరేంద్ర మోదీ, సీఎం చంద్రబాబు నాయుడు నిరంతరం కృషి చేస్తున్నారన్నారు. కోటి ఫేక్ సంతకాలు వారివైతే.. వేల కోట్ల మంది ఆప్యాయతలు మావన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి శ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

### శ్రీకాకుళం అంతా నా కుటుంబం

శ్రీకాకుళం అంతా నా కుటుంబమని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ వెల్లడించారు. డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ కళావేదికలో క్రిస్మస్ సంబరాలు-2025 (హైటీ) వేడుకలను సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయనతో పాటు శ్రీకాకుళం, నరసన్నపేట ఎమ్మెల్యేలు గొండు శంకర్, బగ్గు రమణమూర్తి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తాను చదువుకున్నది సెయింట్ జోసఫ్ స్కూల్ అని, క్రిస్టమస్ అంటే క్రిస్టమస్ కేరల్స్... ఒక మంచి భావంతో అందరినీ కలవడమే అని తెలిపారు. క్రిస్టమస్ దినాలలో ఎలాంటి సమస్యలు లేకుండా తగు చర్యలు చేపడతామన్నారు. మూడు నెలలకు ఒకసారి క్రిస్టియన్ల సమస్యలపై సమావేశం ఏర్పాటు చేస్తామన్నారు. బరియేల్ గ్రౌండ్ సమస్యలపై ఇప్పటికే ఆర్డీఓ, తహసీల్దార్లుకు ఆదేశాలు జారీ చేసినట్లు చెప్పారు. కమ్యూనిటీ హాల్‌కు మున్సిపల్ కార్పొరేషన్ నిధులు సమకూర్చనున్నట్లు తెలిపారు. చర్చిల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకుంటామన్నారు. శాసన సభ్యులు గొండు శంకర్, బగ్గు రమణమూర్తిలు మాట్లాడుతూ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకొని క్రిస్టమస్ వేడుకలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. పాస్టర్స్ ఫెలోషిప్ రాష్ట్ర జనరల్ సెక్రటరీ బోసుబాబు మాట్లాడుతూ క్రిస్టమస్ దినాలలో క్రిస్టమస్ కేరల్స్ కు వెళ్లిన సమయంలో ఆటంకాలు లేకుండా చూడాలని కోరారు. ట్రైనీ కలెక్టర్ పృథ్వీ రాజ్ కుమార్ మాట్లాడుతూ అందరూ సహోదర భావంతో ఉండాలని కోరారు. ఆర్డీఓ కె. సాయి ప్రత్యూష మాట్లాడుతూ అందరికీ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పాస్టర్ విశ్వాసరావు, పాస్టర్ పి. కృపానందం, డిఎస్విఎస్ కుమార్, పాస్టర్ అరుణ్ కిరణ్, పాస్టర్ జోసెఫ్ దానియేలు, పాస్టర్ దేవదాసు, పాస్టర్ జాకబ్, మైనార్టీ సంక్షేమ అధికారి షరీఫ్, తహసీల్దార్ గణపతిరావు, జిల్లాలోని పాస్టర్లు, తదితరులు పాల్గొన్నారు.

జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



## గణిత ఉపాధ్యాయులకు సత్కారం

**పలాస, డిసెంబరు 22(వార్త):** పలాస మండలం తాళభద్ర హైస్కూల్ నందు మాదిన.విద్యా సాగర్, నగరి.లక్ష్మీ గణిత ఉపాధ్యాయులను... గణిత ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా హెడ్మాస్టర్ గోపికృష్ణ, ఉపాధ్యాయ సిబ్బంది ఘనంగా సోమవారం సత్కరించారు. విద్యార్థులతో గణిత క్విజ్ పోటీ నిర్వహించి విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు గోపికృష్ణ మాట్లాడుతూ ప్రాథమిక విద్య నుండి పిల్లలకు పజిల్స్, ఇతర పోటీ పరీక్షల్లో పాల్గొనే విధంగా ప్రోత్సహించాలని తెలియజేశారు. ప్రాథమిక విద్యా స్థాయిలో పిల్లలకు పజిల్స్, పోటీ పరీక్షల్లో పాల్గొనేలా ప్రోత్సహించడం వారి మెదడు శక్తి, ఏకాగ్రత, సమస్య పరిష్కార నైపుణ్యాలను పెంచుతుందని చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌లో ఇటీవల ఆర్ ఎ ఎ కింద క్విజ్ పోటీలు, ఒలింపియాడ్స్‌లు నిర్వహిస్తున్నారు. ఇవి పిల్లల ఆసక్తిని రేకెత్తిస్తాయని తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సహకారంతో స్థానిక పాఠశాలల్లో ఇలాంటి కార్యక్రమాలు అమలు చేయవచ్చునని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కే మాధవి లత, జయప్రద, శ్రీదేవి, లోకనాథం, హైమావతి, శంకర్రావు వేదవతి సాహితీ ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



## చట్టాలపై అవగాహన ఉండాలి




**పలాస, డిసెంబరు 22(వార్త):** గ్రామీణ ప్రాంత ప్రజలకు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని కాశీబుగ్గ ఎస్సై ఆర్ నరసింహమూర్తి తెలిపారు. రేంటికోట కాలనీలో, టెక్కలి పట్నం గ్రామాల్లో కాశీబుగ్గ పోలీసులు నారి శక్తి, చట్టాలపై ప్రజలకు సోమవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కాశీబుగ్గ ఎస్సై మాట్లాడుతూ నారీ శక్తి అంటే మహిళల సాధికారత, రక్షణకు సంబంధించిన చట్టాలు, కార్యక్రమాలని వివరించారు. ఈ చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పించడం ద్వారా సమాజంలో మహిళల భద్రత, అభివృద్ధి పెరుగుతుందని చెప్పారు. ప్రతి వ్యక్తి నారీ శక్తి యాప్ డౌన్‌లోడ్ చేసి, చట్టాల గురించి తెలుసుకోవాలని కోరారు. స్థానిక పంచాయతీలు, పాఠశాలల్లో అవగాహన సభలు నిర్వహించడం ద్వారా మహిళా సాధికారత పెరుగుతుందని, ఈ చట్టాల అమలు ప్రజల సహకారంతోనే సాధ్యమవుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో కాశిబుగ్గ నారిశక్తి టీం సభ్యులు, పోలీసులు పాల్గొన్నారు.

## చోరీ కేసులో ఒకరికి జైలు శిక్ష

**పలాస, డిసెంబరు 22(వార్త):** పలాస మండలం, కాశిబుగ్గ పద్మనాభపురం కాలనీకి చెందిన రెల్లి విజయకుమార్, లండ వెంకటేశ్వరులకు చోరి కేసులో ఆరు మాసాలు జైలు శిక్ష విధిస్తూ పలాస కోర్టు జూనియర్ సివిల్ జడ్జ్ యు. మాధురి సోమవారం తీర్పునిచ్చారని కాశిబుగ్గ పోలీస్ స్టేషన్ సిఐ రామకృష్ణ తెలిపారు. ఈ సంవత్సరం జూన్ నెల లో జరిగిన చోరి కేసు కు సంబంధించి పుల్లా శ్రీనివాసరావు అక్కుపల్లి జంక్షన్ వద్ద ఉన్న తన క్యాటరింగ్ గోడౌన్ నుండి రెండు గ్యాస్ సిలిండర్లు దొంగిలించబడిన కేసులో ఇచ్చిన ఫిర్యాదు పై ఎస్ ఐ ఆర్.నరసింహమూర్తి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ కేసులో పబ్లిక్ ప్రాసిక్యూటర్ పి. రమేష్ వాదనలు వినిపించారు. ఈ కేసులో నేరం రుజువు కావడంతో తుది తీర్పు ఇచ్చారని కాశీబుగ్గ సిఐ తెలిపారు.

## అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన




**సోంపేట, డిసెంబరు 22(వార్త):** కంచిలి మండలం కుతుమ గ్రామపంచాయతీలో పలు అభివృద్ధి పనులకు ప్రభుత్వ విప్, ఇచ్చాపురం ఎమ్మెల్యే డాక్టర్ బెందాళం అశోక్ సోమవారం శంకుస్థాపనలు చేశారు. సుమర్ కోటి రూపాయలు పైగా నిధులతో పలు రోడ్ల నిర్మాణానికి చేపట్టిన శంకుస్థాపన కార్యక్రమాల్లో ఎమ్మెల్యే అశోక్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో అభివృద్ధి ధ్యేయంగా అనేక కార్యక్రమాలు చేపడుతూ గ్రామాలను తీర్చు దిద్దుతున్నామని అన్నారు. ప్రభుత్వానికి ఆర్థికంగా ఎన్ని ఇబ్బందులు ఉన్నా గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ఆటంకం లేకుండా కృషి చేస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో కంచిలి మండల టిడిపి అధ్యక్షులు మాదిన రామారావు, సీనియర్ నాయకులు జీకే నాయుడు, ఏం సి చైర్ పర్సన్ ప్రతినిధి మద్దిల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## గోవిందపురంలో శత శాతం పోలియో చుక్కలు



**వజ్రపుకొత్తూరు, డిసెంబరు 22(వార్త):** చిన్నారులకు అంగవైకల్యం రాకుండా నిండు జీవితానికి రెండు చుక్కలు నినాదంతో పోలియో రహిత సమాజం నిర్మించడం కోసం పల్స్ పోలియో కార్యక్రమంలో భాగంగా మండలంలో గోవిందపురం ప్రభుత్వ ఆసుపత్రి పరిధిలో అన్ని గ్రామాలలో పల్స్ పోలియో కార్యక్రమం ఆదివారం ఘనంగా నిర్వహించి సోమవారం వైద్య సిబ్బంది ప్రతి ఇంటికి వెళ్లి ఆదివారం అందని చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. పీహెచ్సీ వైద్యాధికారులు డాక్టర్ వాహిని ప్రియాంక, డాక్టర్ వినయ్ కుమార్ ఆధ్వర్యంలో 2015 మంది ఐదేళ్లలోపు చిన్నారులకు పోలియో చుక్కలు వేయాల్సి ఉండగా 2027 చిన్నారులకు పోలియో చుక్కలు వేసి 100% పైగా నమోదైనట్లు డాక్టర్ వాహిని ప్రియాంక తెలిపారు . ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## సీత సాగరం ఆక్రమణలు తొలగించాలి




**సోంపేట, డిసెంబరు 22(వార్త):** సోంపేట పట్టణం శ్రీశైలం వీధి సమీపంలో సీత సాగరం చెరువు ఆక్రమణలకు గురవుతుందని ఇటువంటి ఆక్రమణలు తొలగించి సాగునీటి వనరులు కాపాడాలని సీనియర్ వైసీపీ నేత ఎంపీటీసీ సభ్యుడు పొడుగు కామేష్ సోమవారం గ్రీవెన్స్ కార్యక్రమంలో తహసిల్దార్ బి అప్పల స్వామికి ఫిర్యాదు చేశారు. కొంతమంది వ్యక్తులు విశాలమైన చెరువుగట్టును ఆక్రమించేందుకు గట్టుపై ఉన్న రాళ్లు ఇసుక వంటి మెటీరియల్ కూడా చెరువులో కప్పేసి చెరువును చదును చేయడం గమనించాలని కోరారు. సమీప రైతులకు పంట పొలాలకు ఈ చెరువు నీరు ఎంతో ఉపయోగకరమని గుర్తు చేశారు. చట్ట ప్రకారం ఇటువంటి చెరువులను కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందని పేర్కొన్నారు. వెంటనే చెరువును పరిశీలించి ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని కోరారు.అలాగే పంచాయతీ ఈఓ కు దీనిపై ఫిర్యాదు చేశారు.

# ఉపాధి హామీని కొనసాగించాలి

### -ఆర్డీఓ కార్యాలయం వద్ద వామపక్ష నేతల ధర్నా

**పలాస, డిసెంబరు 22(వార్త):** గ్రామీణ పేదల జీవనోపాధిలో కీలక పాత్ర పోషిస్తున్న మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేస్తూ దాని స్థానంలో విబిజి రామ్ జి పేరుతో తీసుకువచ్చిన బిల్లును ఉపసంహరించాలని, ఉపాధి హామీ పథకాన్ని యదావిధిగా కొనసాగించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కే మోహన్ రావు, లిబరేషన్ పార్టీ జిల్లా కార్యదర్శి తామడ సన్యాసిరావు, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి లండ వెంకటరావు, ఐ.ఎఫ్ టియు నాయకులు జుత్తు వీరస్వామి, ఏఐకేఎంఎస్ కార్యదర్శి మద్దిల రామారావు, సిఐటియు కార్యదర్శి ఎన్ గణపతి, జీడి రైతు సంఘం జిల్లా కన్వీనర్ తేప్పల అజయ్ కుమార్, రైతు కూలీ సంఘం నాయకులు కోనేరు రమేషులు డిమాండ్ చేశారు. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేస్తూ కేంద్రం చేస్తున్న సవరణలకు నిరసనగా వామపక్ష పార్టీలు, ప్రజా సంఘాలు ఆధ్వర్యంలో పలాస ఆర్ డి ఓ కార్యాలయం వద్ద సోమవారం ధర్నా చేపట్టారు. అనంతరం ఆర్ డి ఓ జి వెంకటేష్ కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చట్టబద్ధ హక్కుగా ఉన్న పథకాన్ని రద్దు చేసేందుకు కేంద్రం చేస్తున్న కుట్రలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. కేంద్ర ప్రభుత్వం తెస్తున్న వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్ గార్ అండ్ అజీవిక మిషన్ (విబి-జి రాం జి) పేరుతో ఉపాధిహామీ చట్టనికి రాంరాం పలకనున్నారన్నారు. పని హక్కుగా ఉన్న పాత చట్టాన్ని మార్చి ఇదొక సాధారణ పథకంగా అమలు చేసేందుకు కుట్ర పన్నుతున్నారని ధ్వజమెత్తారు. ఇప్పటి వరకు వ్యవసాయ కార్మికులకు డిమాండును బట్టి ఉపాధి కల్పించే విధానాన్ని మార్చివేసి అవసరాన్ని బట్టి పనులు పెట్టడం అంటే ఈ పథకం మౌలిక స్వభావాన్ని నిర్వీర్యం చేయడం కాదా అని ప్రశ్నించారు. మోడీ ప్రభుత్వం పథకంలోని మహాత్మా గాంధీ పేరును తొలగించి ద్రోహం చేస్తుందని అన్నారు. మరోవైపు 10 నుండి 40 శాతానికి రాష్ట్రాలపై భారం పెంచడం దారుణమన్నారు. ఇప్పటికే యంత్రాలు




కేటాయించి కూలీల డిమాండ్ తగ్గించారని దుయ్యబట్టారు. వ్యవసాయ పనుల పేరుతో 60 రోజుల ఉపాధిని సస్పెండ్ చేసి ఈ పథకాన్ని రైతులకు పోటీగా మారుస్తుందని విమర్శించారు. ఈ పథకం అమలుకు ఇప్పటి వరకు కేంద్రం ఇస్తున్న 90% నిధులను 60 శాతానికి తగ్గించి రాష్ట్రాలపై వేల కోట్ల అదనపు భారం వేస్తుందన్నారు. మన రాష్ట్రంపై ఏటా సుమారు నాలుగు వేల కోట్లు అదనపు భారం పడనుందని, ఇప్పటికే లక్షల కోట్లు అప్పుల్లో వున్న రాష్ట్రం ఈ అదనపు భారాన్ని ఎలా భరించగలదు? అని ప్రశ్నించారు. మోడీ ప్రభుత్వానికి మద్దతు తెలుపుతున్న తెలుగుదేశం, జనసేన పార్టీలు కొత్త ఉపాధి బిల్లును ఉపసంహరించుకునేటట్లు కేంద్రంపై ఒత్తిడి తేవాలని డిమాండ్ చేశారు. రాష్ట్రానికి చెందిన అన్ని పార్టీల ఎంపీలు పార్లమెంటులో దీన్ని వ్యతిరేకించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వంకల ముకుంద ,రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి తమ్మినేని భాస్కరరావు, టి లక్ష్మి , కె హేమ సూ ధనరావు, కే బాలాజీ రావు,టి. రాజు, పి ఓ డబ్ల్యు జిల్లా కార్యదర్శి కుసుమ, యన్ డిల్లేశ్వరి,బి ప్రసాద్, కే లోకనాథం, మాకన్నపల్లి సర్పంచ్ సైని దేశయ్య, గేదెల నీలకంఠం, కుత్తుమ. ధర్మారావు తదితరులు మాట్లాడుతూ ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసే కుట్రలకు వ్యతిరేకంగా ఉద్యమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వామపక్ష, ప్రజా సంఘాల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## సుబ్బారావు పాణిగ్రాహి సభ విజయవంతం



**పలాస, డిసెంబరు 22(వార్త):** బొడ్డపాడు అమరవీరుల స్మారక మందిరంలో జరిగిన కామ్రేడ్ సుబ్బారావు పాణిగ్రాహి 56 వర్ధంతి సభ ఆట పాటలతో ఘనంగా జెండా ఆవిష్కరణలతో నిరంజన్ సాహు, పోతనపల్లి మల్లేశ్వరరావుతో సోమవారం జెండా ఆవిష్కరణ చేశారు. అనంతరం అమరవీరులకు నివాళులర్పించారు. ఈ సభకు రాష్ట్రం నలు మూలల నుంచి సాంస్కృతిక బృందాలు గాలపానతో ప్రజలకు ఉల్లాస పరిచి చైతన్య పరిచారు. కామ్రేడ్ సుబ్బారావు పాణిగ్రాహి తను వ్రాసిన ప్రతి పాట విశ్వం ఉన్నంత వరకు శాశ్వతమని, ఒక్క చేతితో పెన్ను, మరో చేతితో గన్ పట్టి రాష్ట్ర నలుమాలు తిరిగి ఉగ్రూతలూగించిన మహా కళాకారుడు కామ్రేడ్ సుబ్బారావు పాణిగ్రాహి కళ కళ కోసం కాదు, కళ బ్రతుకులు మార్చాలంటూ, ప్రజలను చైతన్య పరిచే కళయే నిజమైన కళలనీ పీడిత ప్రజలకోసం పోరాడి ఒరిగిన నాయకులు కామ్రేడ్ సుబ్బా రావు పాణిగ్రాహిఅని ఈసభకు ప్రజాకళా మండలి రాష్ట్ర ఉపాధ్యాక్షులు కొర్రాయి నీలకంఠం, రాష్ట్ర నలుమాలనుండి విచ్చేసిన అరసవల్లి క్రిష్ణ, సిపిఐ యంయల్ లిబరేషన్ సీనియర్ నాయకులుకామ్రేడ్ మద్దిల మల్లేశ్వరరావు, పిఓడబ్ల్యు జిల్లా నాయకులు కామ్రేడ్ పోతనపల్లి కుసుమ, జిల్లా కార్యదర్శి కామ్రేడ్ తామాడ సన్యాసిరావు, ప్రజా కళా మండలి అధ్యక్షులు కామ్రేడ్ కోటిలతో పాటు ప్రజాస్వామిక వాదులంతా వేదికని అలంకరించి కామ్రేడ్ సుబ్బారావు పాణిగ్రాహి జీవిత చరితను ప్రస్తుత రాజకీయలను జోడించి భవిష్యత్ కార్యాచరణ చేసుకొని, ఫాసిస్టు ప్రభుత్వ విధానాలను త్రిప్పి కొట్టాలని మాట్లాడిన వక్తలు తెలిపారు. కార్యక్రమాన్ని గత నెల రోజుల నుండి తన భుజాన వేసుకొని, వెనుకనుండి నడిపిన కామ్రేడ్ పోతన పల్లి అరుణమ్మకు ,కార్యక్రమాన్ని విజయ వంతం చేసిన బొడ్డపాడు కామ్రేడ్స్ కు , ప్రజలకు సభాధ్యక్షులు నీలకంఠం విప్లవాభి వందనాలు తెలియజేసారు. అనంత పురం నుండి విచ్చేసిన ప్రకాశం జిల్లా కార్యదర్శి చింతాడ కృష్ణమూర్తి కుల నిర్మూలన పోరాట సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు మిస్ట్ కృష్ణయ్య డీటీఫ్ నాయకులు ధర్మారరావు మాస్టారు, పుచ్చ దుర్యోధన ప్రజాకళామండలి చంద్రన్న కళాబ్రుందం, రంగం కళా బృందం కోనారి సూదన, ఉదయ్ బాస్కర్, కళాబ్రుందం, జనసాస్కృతిక కళా మండలి (జెయస్ఎమ్)ల కళాబ్రుందాలతో గాలాపనని చేసారు. ప్రజలు ప్రజాస్వామిక వాదులు విరివిగా పాల్గొని సభను విజయవంతం చేసారు.

## అపార గణిత మేధావి రామానుజన్

**మందస, డిసెంబరు 22(వార్త):** శ్రీనివాస రామానుజన్ అపార గణిత మేధావి అని పల్లిసారధి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఇన్చార్జి ప్రధానోపాధ్యాయుడు గుంట కోదండరావు అన్నారు. గుంట కోదండరావు అధ్యక్షతన జాతీయ గణిత దినోత్సవం ఘనంగా జరిగినది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీనివాస రామానుజన్ గణిత ఆవిష్కరణలు ఈనాటికి అర్థం చేసుకోలేనంత అపార మేదస్సుతో కూడినటువంటివని తెలుపుతూ ప్రతీ విద్యార్థి గణితం పట్ల మక్కువ ప్రదర్శిస్తే తప్పనిసరిగా గొప్ప మేధస్సును సొంతం చేసుకోవచ్చని తెలిపారు. పాఠశాల మేనేజ్మెంట్ కమిటీ చైర్పర్సన్ దున్న కవిత మాట్లాడుతూ శ్రీనివాస రామానుజన్ పేదరికాన్ని సహితం లెక్కచేయకుండా గణితం పట్ల చూపించిన మక్కువ ప్రస్తుత కాలంలో కూడా ప్రపంచానికి అనేక రంగాల్లో ఉపయోగపడుతుందని తెలుపుతూ ప్రతి విద్యార్థి తన మేధస్సును సమాజ అభ్యున్నతికి దోహదపడే విధంగా అభివృద్ధి చేసుకోవాలని కోరారు. గణిత ఉపాధ్యాయుడు ఎస్.పాపారావును సన్మానించిన ఈ కార్యక్రమంలో శ్రీనివాస రామానుజన్ జీవిత విషయాలతో పాటు రామానుజన్ సంఖ్య 1729 ప్రత్యేకతను ఆయన తెలియజేశారు. పాఠశాల విద్యార్థులు వక్తృత్వ, వ్యాసరచన, పోటీలతోపాటు గణితంతో మ్యాజిక్, ఘనము, శంకు వంటి



త్రిమితీయ పటాల పార్కులు, సంఖ్యావర్గాలు ,వివిధ గణితఫార్ములాలు పైఏర్పాటుచేసిన ప్రదర్శనలు స్థానిక ప్రాథమిక పాఠశాల విద్యార్థులు కూడా వీక్షించి గణితం పై ఆసక్తిని ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు బి.అన్నపూర్ణ, ఎం.హరనాథ్, ఎం.జయప్రద, ఆర్.స్వర్ణలత, ఎస్.ప్రశాంతి, ఎస్.సీతమ్మ, కె.నాగభూషణ్, టి.శివాజీ తదితరులు పాల్గొన్నారు.

## విజ్ఞానభారతిలో గణిత అష్టావధానం



**నరసన్నపేట, డిసెంబరు 22(వార్త):** నరసన్నపేటలోని విజ్ఞాన భారతి పాఠశాలలో శ్రీ శ్రీనివాస్ రామానుజన్ జయంతిని పురస్కరించుకొని సోమవారం ఘనంగా గణిత అష్టావధానం, గణిత ఎగ్జిబిషన్ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విశ్రాంతి మండల విద్యాశాఖ అధికారి శ్రీ బంకుపల్లి చంద్రశేఖరం, విశిష్ట అతిథిగా విశ్రాంతి ఇంజనీర్ శ్రీ కె. వైకుంఠ రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గణిత ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేసి విద్యార్థుల సృజనాత్మక ఆలోచనలను ప్రోత్సహించామని పాఠశాల గణిత ఉపాధ్యాయులు శ్రీమతి శైలజ తెలిపారు. అనంతరం నిర్వహించిన గణిత అష్టావధాన కార్యక్రమంలో విద్యార్థులు సంఖ్యలతో ఆటలు, వర్గాలు, క్యాలెండర్ సమస్యలు, రెండు సంఖ్యల గుణకారం, డైస్ కోడ్స్, గణిత పట్టికలు, సరస ప్రసంగం, మనసులో మాట ప్రశ్నలు వంటి ఎనిమిది అంశాలపై ప్రశ్నలు సంధించారు. చిన్నారి పొట్నూరు నవనీత్ సత్య సాయి అవధానిగా అన్ని ప్రశ్నలకు తక్షణమే సమాధానాలు ఇస్తూ అందరినీ ఆకట్టుకున్నాడు. పలువురు రౌండ్లుగా ఈ కార్యక్రమం సాగి విద్యార్థుల్లో గణితంపై ఆసక్తిని పెంచింది. శ్రీ మద్దు తిరుపతిరావును ఆదర్శంగా తీసుకొని ఆయన సలహా మేరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు పాఠశాల ప్రధానాచార్యులు డిలేశ్వరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో భారతీయ విద్యా కేంద్రం విశాఖపట్నం అధికారులు శ్రీ కె. ఏవి. కృష్ణమాచార్యులు, శ్రీ డి. రమణమూర్తి, పాఠశాల ప్రబంధకారిణి కమిటీ అధ్యక్షులు శ్రీ నానాజీ గాడ్డే, కరస్పాండెంట్ డాక్టర్ సురేష్ కుమార్, ప్రబంధకారిణి, ఉపాధ్యాయులు, విద్యార్థులు మరియు తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## యూనివర్సిటీ పేపర్ లీక్ సినిమా చూడండి



**పలాస, డిసెంబరు 22(వార్త):** యూనివర్సిటీ పేపర్ లీక్ సినిమాకు ఆహ్వానం చేసేందుకు ప్రముఖ సినీ నటుడు సినీ నిర్మాత, దర్శకుడు ఆర్. నారాయణ మూర్తి సోమవారం విద్య వాహిని డైరెక్టర్ తిరుమలరావు, సోషల్ డెవలప్ స్పెషలిస్ట్ చెన్నూరు మల్లేశ్వరరావులను మర్యాదపూర్వంగా భేటీ అయ్యారు. ఆర్ నారాయణమూర్తితో అనేక సామాజిక , విద్య,సామాజిక మార్పులు, సమాజ అభివృద్ధి గురించి చర్చించారు. అందువలన అందరూ యూనివర్ సిటీ పేపర్ లీక్ సినిమా చూసి అందులో గల విద్యా విధానాలు, మార్పులు తెలుసుకోవాలని, ప్రజలకు, విద్యార్థులకు తెలియ చేస్తున్నామని వెల్లడించారు. భారతదేశంలో జాతి పద్ధతి సంస్కరణలు, కుల గణనలు సామాజిక సమానత్వాన్ని పెంచుతున్నాయని, గ్రామీణ నగరీకరణ, మహిళలకు 33% రిజర్వేషన్లు రాజకీయాల్లో మార్పు తీసుకురుతున్నాయని వివరించారు.

## టీడీపీపీ ప్రధాన కార్యదర్శి విఠల్‌కు సన్మానం




**పలాస, డిసెంబరు 22(వార్త):** శ్రీకాకుళం జిల్లా గ్రంధాలయ చైర్మన్‌గా, శ్రీకాకుళం పార్లమెంటు ప్రధాన కార్యదర్శిగా నియమించబడిన పీరికట్ల విఠల్ కి టిడిపి పార్టీ కార్యాలయంలో సోమవారం ఘనంగా సన్మానించారు. నిత్యము కార్యాలయంలో ఉంటూ అందరికీ చేదోడు వాదోడుగా ఉంటున్న మా కార్యాలయ ఆప్తులు విఠల్ కు ఇలాంటి ఎన్నో సన్మానాలు జరగాలని కోరారు. తెలుగుదేశం పార్టీ కార్యాలయం సిబ్బంది అనంత కుమార్ యాదవ్, బూర్ల విజయ్ తదితరులు ఉన్నారు.

## డిజిటల్ చెల్లింపుల్లో జాగ్రత్తలు తీసుకోవాలి



**పలాస, డిసెంబరు 22(వార్త):** డిజిటల్ చెల్లింపుల్లో జాగ్రత్తలు తీసుకోవాలని పలాస తహసిల్దార్ కళ్యాణ్ చక్రవర్తి అన్నారు. పలాస ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం జిల్లా వినియోగదారుల సంఘాల సమాఖ్య ఆధ్వర్యంలో చైతన్య సదస్సు సోమవారం నిర్వహించారు. జాతీయ వినియోగదారుల సంఘ వారోత్సవాల సందర్భంగా జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమానికి జిల్లా గ్రామీణ వినియోగదారుల సంఘాల సమాఖ్య అధ్యక్షులు డి.ఉమామహేశ్వరరావు అధ్యక్షత వహించారు. ఇందులో డివిజనల్ ఫుడ్ ఆఫీసర్ శ్రీరాములు మాట్లాడుతూ వినియోగదారులు కొనుగోలులో పాటించవలసిన జాగ్రత్తలు వివరించారు. ప్రత్యేక ఆహ్వానితులు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జె. వెంకటలక్ష్మి, లైన్స్ పూర్వ అధ్యక్షులు హెచ్ వై దొర, మండల విద్యాశాఖ అధికారి శ్రీనివాసరావు తదితరులు మాట్లాడారు. విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి మధుర చరిత్రకారుడు కొండల మధుబాబు, అధ్యాపకుడు బి.ప్రసాదరావు పాల్గొన్నారు.

## జాతీయ గణిత దినోత్సవం

**పలాస, డిసెంబరు 22(వార్త):** జాతీయ గణిత దినోత్సవం సందర్భంగా సోమవారం రామక్రిష్ణపురములో ఉన్న శ్రీ సత్యసాయి విద్యావిహార్ నియోజకవర్గ స్థాయి లో గణిత క్విజ్ పోటీలు ఏర్పాటు చేశారు. ఈ పోటీలలో మొత్తం 23 టీమ్ లు పాల్గొనగా సత్య ధర్మ టీమ్ లు ప్రదమ ద్వితీయ స్థానములో నిలవడం జరిగింది. వీళ్లకి బహుమతులు సర్టిఫికేట్ లును ముఖ్య అతిథిగా పాల్గొన్న గవర్నింగ్ బాడీ సభ్యులు శ్రీ సత్యసాయి సేవాసంస్థలు నరసన్నపేట జోనల్ కన్వీనర్ నారాయణమూర్తి అందజేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ మల్లా రామేశ్వరరావు, ఉపాధ్యక్షులు తాలాసు శ్రీను ప్రిన్సిపాల్ ప్రీతిచౌదరి, గణిత ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు

**జి.సిగడాం, డిసెంబరు22(వార్త):** శాంతిభద్రతలకు ఎవరైనా విఘాతం కలిగిస్తే చర్యలు తీసుకుంటామని ఎస్ఐ వి.సందీప్‌కుమార్ హెచ్చరించారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని గ్రామాల్లో శాంతి భద్రతల పరిరక్షణే లక్ష్యంగా సోమవారం పెంట, నాగులవలస, సీతంపేట, పాలఖండ్యాం గ్రామాలను సందర్శించి ప్రజలతో సమావేశమయ్యారు. సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారించా మన్నారు. గ్రామాల్లో సారా, మట్కా, పేకాటను చోరీలు సమూలంగా నిర్మూలించటమే లక్ష్యంగా పని చేస్తున్నామన్నారు. గ్రామాల్లో సమస్యలు ఉంటే పోలీసుల దృష్టికి తీసుకు వస్తే పరిష్కరించే విధంగా కృషి చేస్తారని తెలిపారు. పండగలు, యాత్రలు సమయాల్లో డీజేలు పెట్టడం నిషేధమని, లక్కీడ్రా, లాటరీల నిర్వహణలో అనుమతి లేదని నిర్వ హించే వారిపై చట్ట పరమైన చర్యలు ఉంటాయని తెలిపారు. పోలీస్ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.



# మండపల్లిలో నిధుల దుర్వినియోగం

### -ప్రభుత్వ విప్ అశోక్



**ఇచ్ఛాపురం, డిసెంబరు 22(వార్త):** నియోజకవర్గంలో సొంత అంగన్వాడీ భవనాల నిర్మాణాలకు కృషిచేస్తానని మూడు సార్లు గెలవటానికి మంచి మెజార్టీ ఇచ్చిన మండపల్లి పంచాయితీని పూర్తిస్థాయిలో అభివృద్ధి పథంలో నడిపిస్తానని ప్రభుత్వ విప్ నియోజకవర్గ ఎమ్మెల్యే బెందాళం అశోక్ అన్నారు. మండపల్లి లో నూతనంగా రూ16 లక్షలో నిర్మించిన అంగన్వాడీ కేంద్రాన్ని ఎమ్మెల్యే సోమవారం ప్రారంభించారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న పోషకాహారాలు సక్రమంగా అందివ్వాలని పిల్లల పట్ల ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని అంగన్వాడీ కార్యకర్తలకు సూచించారు. అనంతరం సీడీపీఓ రాజేశ్వరి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ వ ఉండపల్లి పంచాయితీ తనకు ఓ ప్రత్యేకమనిమంచి మెజార్టీ ఇచ్చిన ప్రజలకు రుణపడి ఉంటానని అన్నారు. ప్రోటోకాల్ పేరిట అదికారులను బెదిరిస్తున్న వ్యక్తులు గత వైసీపీ 5 ఏళ్లలో ఎప్పుడైనా ప్రోటాకాల్ పాటించారా అని ప్రశ్నించారు. ఈ పంచాయితీలో ఇద్దరు పంచాయితీ కార్యదర్శి లు సస్పెండ్ కి గురి అయ్యారని అన్నారు. ఈ పంచాయితీలో రూ88 లక్షల నిధులు దుర్వినియోగం కావటంతో ఇద్దరు పంచాయితీ సెక్రటరీలను సస్పెండ్ చేయటం జరిగిందని తెలిపారు. పనులు చేయకుం డా చేసినట్లు బిల్లులు తీసుకోవటం వల్ల సస్పెండ్ చేయటంతో పాటు ఇద్దరు సెక్రటరీలను షోకేజ్ నోటీసులు ఇవ్వటం జరిగిందని అన్నారు. గతంలో ఎమ్మెల్యేగా ఉన్నప్పటికీ అప్పటి ప్రభుత్వం ఏ పనులు చేయకుండా అడ్డుకున్నారని కాని కూటమి ప్రభుత్వం అదికారంలో ఉంది అన్ని పనులు పూర్తి చేసానని అన్నారు. భీమసముద్రం గెడ్డ మీద బ్రిడ్జ్ నిర్మాణానికి అన్ని చర్యలు చేపడుతున్నాం ఈమద్య ఇరిగేషన్, పంచాయితీరాజ్ అదికారులతో సమీక్షించి అంచనాలు కూడా వేసాం. త్వరలో పనులు ప్రారంభం కూడా అవుతుందని అన్నారు. బుడ్డెవు పేటలో లో అంగన్వాడీ భవనానికి ఎంపేటీసీ సభ్యులు పాతిర్ల చంద్రశేఖర్రెడ్డి తన సొంత డబ్బులు 3.5 లక్షలు పెట్టి అంగన్వాడీ భవనం నిర్మానం సగం వరకు చేపట్టారు మిగిలిన భవనం పనులు కూడా తన సొంత డబ్బులతో పూర్తి చేస్తానని సభాముఖంగా చెప్పటం శుభపరిణామమని అన్నారు. వైసీపీ పార్టీకి చెందిన సర్పంచ్ అనే వ్యక్తి దూరంగా ఉన్న బుడ్డెపుపేట ను వేరే పంచాయితీగా చేయటానికి తీర్మానం అడిగితే అక్రమంగా చేసిన బిల్లులను నాకు చెల్లిస్తే పంచాయితీ తీర్మానం ఇస్తానని అన్న దౌర్భాగ్యమైన పరిస్థితి అని అన్నారు. ఊరుకి మంచి జరుగుతాదంటే కూడా ఈ సర్పంచ్ అడ్డుకోవటం దారుణమని ఇలాంటి వ్యక్తులను ప్రజలకు బాగా గుర్తించుకోవాలని అన్నారు. ఈ పంచాయితీలో మిగిలిన మూడు అంగన్వాడి. భవనాలు నిర్మాణాలు పూర్తి చేస్తానని అంతే కాకుండా పంచాయితీలో పూర్తిస్థాయిలో అభివృద్ధి పథంలో నడిపిస్తానని అన్నారు. ప్రధానంగా త్రాగునీటి సమస్యపై ప్రత్యేక దృష్టి సారించి నీటి సమస్య పరిష్కరిస్తానని అన్నారు. జల జీవన్ మిషన్ కి సంబందించి టెండర్ ప్రక్రియ కూడా అడ్డుకోవటం దారుణమని ఇలాంటి వ్యక్తులను ప్రజలకు బాగా గుర్తించుకోవాలని అన్నారు. ఈ పంచాయితీలో మిగిలిన మూడు అంగన్వాడీభవనాల నిర్మాణాలు పూర్తి చేస్తానని అంతే కాకుండా పంచాయితీలో పూర్తిస్థాయిలో అభివృద్ధి పథంలో నడిపిస్తానని అన్నారు. ప్రధానంగా త్రాగునీటి సమస్యపై ప్రత్యేక దృష్టి సారించి నీటి సమస్య పరిష్కరిస్తానని అన్నారు. తాగునీరు కు సంబందించి టెండర్ ప్రక్రియ కూడా పూర్తి అయ్యిందని త్వరలో పనులు కూడా ప్రారంభం అవుతాయని అన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత రూ30 లక్షలతో రోడ్లు నిర్మాణాలు చేపట్టడం జరిగిందని అన్నారు. ఈకార్యక్రమంలో ఎంపీడీఓ ప్రభాకరరావు, రెడ్డిక కార్పోరేషన్ చైర్మన్ కొండా శంకర్రెడ్డి, పీఏసిస్ అధ్యక్షులు పెదిని బాబ్జీ, మండల అధ్యక్షకార్యదర్శులు ఎల్ పద్మనాభం, డి కామేష్, టీడీపీ నాయకులు డి డిల్లీరావు. ఎం సూర్యనారాయణ, చంద్రశేఖర్రెడ్డి, సహదేవ రెడ్డి, గోపి, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీనివాస రామానుజన్ గొప్ప భారతీయ గణిత శాస్త్రవేత్త

### -అంబుగాంలో ఆకట్టుకున్న 1729 ఆకృతి



**మందస, డిసెంబరు 22(వార్త):** గణితంలో అధికారిక శిక్షణ లేనప్పటికీ సంఖ్యా సిద్ధాంతం, గణిత విశ్లేషణ, అనంత శ్రేణులు వంటి రంగాలలో అద్భుతమైన కృషి శ్రీనివాస రామానుజన్ చేశారని ప్రధానోపాధ్యాయుడు కాసం శ్రీనివాసరావు అన్నారు. మందస మండలంలోని అంబుగాం మండల పరిషత్ మోడల్ ప్రాథమిక పాఠశాలలో జాతీయ గణిత దినోత్సవాన్ని పురస్కరించుకొని పాఠశాలలో రామానుజన్ జన్మదినాన్ని విద్యార్థులు నడుమ ఘనంగా నిర్వహించారు. విద్యార్థులతో ఏర్పడ్డ రామానుజన్ సంఖ్య 1729 ఆకృతి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఉపాధ్యాయులు దాసరి ఈశ్వరరావు, జి.సాయమ్మ మాట్లాడుతూ స్వయం బోధకుడైన రామానుజన్ చిన్న వయసులోనే అసాధారణ ప్రతిభ చూపించి, 3000పైగా సిద్ధాంతాలను కనుగొన్నారన్నారు. వాటిలో చాలావరకు తరువాత నిరూపించబడ్డాయని, వీరిని 'అనంతాన్ని ఎరిగిన మనిషి' అని కూడా పిలుస్తారన్నారు. గణితంపై అభిరుచి పెంచుకొని భావిభారత గణిత మేధావులుగా తయారవ్వాలని విద్యార్థులను సూచించారు.

## రైలు పట్టాలపై గుర్తు తెలియని మృతదేహం లభ్యం



**పలాస, డిసెంబరు 22(వార్త):** పలాస జి ఆర్ పి రైల్వే పరిధిలో పలాస పుండి రైల్వే స్టేషన్ల మధ్య సుమారు 35-40 సంవత్సరాల మధ్య వయస్సు గల గుర్తు తెలియని మగ వ్యక్తి గుర్తుతెలియని రైలు ప్రమాదంలో సోమవారం మృతి చెందాడు. మృతుని కుడి చేతికి రాజు అనే పేరు గల లవ్ సింబల్, ఇత్తడ రింగు ఉన్నదని, బ్లూ చెక్స్ ఫుల్ హాండ్స్ షర్టు, బ్లాక్ రంగు గల ప్యాంటు, తెలుపు కట్ లో బనియన్ కలదని పలాస జిఆర్పిఎఫ్ ఎస్ఐ ఏ కోటేశ్వరరావు వెల్లడించారు. మృతదేహమును పలాస గవర్నమెంట్ ఆసుపత్రికి తరలించి మృతదేహంనకు పోస్టుమార్టం నిర్వహిస్తున్నారు. మృతిని వివరాలు తెలిస్తే మరిన్ని వివరాలకు పలాస జిఆర్పి రైల్వే స్టేషన్ సబ్ ఇన్స్పెక్టర్ ఎ కోటేశ్వరరావు 9440627567, 9492250069 నెంబర్ కు సంప్రదించవలెనని విజ్ఞప్తి చేశారు.

## డయాలసిస్ కేంద్రానికి జనరేటర్ మంజూరు




**ఇచ్ఛాపురం, డిసెంబరు 22 (వార్త):** ఇచ్ఛాపురం ప్రభుత్వ సామ జిక ఆసుపత్రి, డయాలసిస్ కేంద్రం నందు ఎలక్ట్రికల్ పవర్ జనరేటర్ కొరకు గతంలో పలుమార్లు అధికారులకు సీడప్ మాజీ చైర్మన్ సాడి శ్యాం ప్రసాద్ రెడ్డి విజ్ఞప్తి చేసిన సంగతి విధితమే, క్రిందటి నెల కమిషనర్ అఫ్ హెల్త్ సౌరబ్ గౌర్‌ని అదేవిదంగా జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దిన్కర్ ని కలిసి కోరిన దరిమిలా జనరేటర్ ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు .ఈ సదుపాయం వలన రోగులకు మెరుగైన సేవలు అందుబాటులోకి వస్తాయి, సౌరబ్ గౌర్ కి, స్వప్నిల్ దిన్కర్ కి ఇచ్ఛాపురం ప్రజలు తరుపున ధన్యవాదములు తెలియజేస్తున్నామని, ప్రజల సమస్యలు సరిగ్గా తెలియజేస్తే సత్వరమే అధికారులు స్పందిస్తారని మరొక్కసారి నిరూపితం జరిగిందన్నారు. కౌన్సిలర్ ప్రతినిధి పిలక విజయ్ కుమార్ రెడ్డి తో కలిసి వెళ్లి జనరేటర్ ఏర్పాటు పరిశీలించినట్లు శ్యాంప్రసాద్ రెడ్డి తెలిపారు.

## పలువురిని పరామర్శించిన చైర్మన్ గిరిబాబు



**పలాస, డిసెంబరు 22(వార్త):** మృతి చెందిన వారి కుటుంబాలను సోమవారం పలాస మున్సిపల్ చైర్మన్ బల్లా గిరిబాబు పరామర్శించి, తన ప్రగాఢ సంతాపం తెలియజేశారు. వజ్రపుకొత్తూరు మండలం అనంతగిరి గ్రామం జర్నలిస్ట్ బందాపు తిరుమలరావు మాతృమూర్తి స్వర్గస్తులైనందున ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని, ఆ కుటుంబానికి సానుభూతిని తెలియజేశారు. పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీ రెండో వార్డ్ నెమలి గ్రామం చెందిన దాసరి పద్మావతి స్వర్గస్తులైనందున ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని ఆ కుటుంబాన్ని పరామర్శించారు. పరామర్శించిన వారిలో వల్లభ వైకుంఠ రావు, డి నాగభూషణం, గ్రామస్తులు, తదితరులు ఉన్నారు.

## క్లస్టర్ స్థాయి గణిత క్విజ్‌లో బుచ్చిపేట మోడల్ పాఠశాలకు ప్రథమస్థానం

**నరసన్నపేట, డిసెంబరు 22(వార్త):** మడపాం క్లస్టర్ పరిధిలోని పాఠశాలల విద్యార్థులకు సోమవారం క్లస్టర్ స్థాయి గణిత క్విజ్ పోటీలను నిర్వహించారు. జాతీయ గణిత దినోత్సవాన్ని పురస్కరించుకుని గణిత ప్రతిభను వెలికితీసే ఉద్దేశంతో ఈ పోటీలను ఏర్పాటు చేశారు. ఈ పోటీలలో బుచ్చి పేట మోడల్ ప్రైమరీ స్కూల్ విద్యార్థులు తనుశ్రీ, కారుణ్య, సాహితీ, వినీల, వినయ్ ప్రతిభ కనబరిచి క్లస్టర్ స్థాయిలో ప్రథమ స్థానాన్ని సాధించారు. గణితంపై అవగాహన, చురుకైన ఆలోచనా సామర్థ్యంతో వారు విజేతలుగా నిలిచారని నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా ప్రతిభ చూపిన విద్యార్థులకు ఎంఈఓ శాంతారావు బహుమతులు అందజేసి అభినందించారు. ఇలాంటి పోటీలు విద్యార్థుల్లో గణితంపై ఆసక్తిని పెంపొందించడంతో పాటు మేధో వికాసానికి దోహదపడతాయని ఆయన పేర్కొన్నారు.



## యూనివర్సిటీ సినిమాకు సీదిరికి ఆహ్వానం



**పలాస, డిసెంబరు 22(వార్త):** యూనివర్సిటీ (పేపర్ లీకేజీ) సినిమా ప్రమోషన్స్ లో భాగంగా సినీ దర్శక నిర్మాత ఆర్.నారాయణమూర్తి సోమవారం పలాసలో మాజీ డాక్టర్ సీదిరి.అప్పలరాజుని మర్యాదపూర్వకంగా కలిసి యూనివర్సిటీ (పేపర్ లీకేజీ) సినిమాని వీక్షించేందుకు రావాలని కోరారు. దీనిపై మాజీ మంత్రి పానుకూలంగా స్పందిస్తూ తప్పకుండా సినిమాకు వస్తానని హామీచ్చారు. ఈ బేటిలో పలాస వైసిపి పట్టణ అధ్యక్షులు సిస్టు గోపి, ఉంగ సాయికృష్ణ, దువ్వాడ రవి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## చెరువులను పార్కులుగా అభివృద్ధి చేయాలి



**సోంపేట, డిసెంబరు 22(వార్త):** సోంపేటలో ఇప్పటివరకు సరైన పార్కు నిర్మాణం లేనందున ప్రజల అవసరం దృశ్య చెరువులను పార్కులుగా అభివృద్ధికి తగువిధంగా కృషి చేయాలని పలువురు టిడిపి నాయకులు తాసిల్దార్ బి అప్పలస్వామికి వినతి పత్రం సోమవారం అందజేశారు. విశాలమైన చెరువుల చుట్టూ ఉన్న పొడవైన గట్లను ప్రభుత్వ నిధులతో తీర్చిదిద్ది అటువంటి గట్లపై వాకింగ్ ట్రాక్ నిర్మాణంతో పాటు ఇరువైపులా మొక్కలు నాటించి సుందరంగా తీర్చిదిద్దాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటువంటి అభివృద్ధి కార్యక్రమాలపై దృష్టి సారిస్తున్న నేపథ్యంలో మండలం నుంచి జిల్లా కలెక్టర్కు రెవెన్యూ శాఖ ద్వారా నివేదిక పంపించాలని కోరారు. దీనివలన చెరువులో ఆక్రమణలకు కూడా గురికాకుండా ఉంటాయని సూచించారు. ఈ కార్యక్రమంలో పట్టణ టిడిపి అధ్యక్షుడు చిత్రాడ శేఖర్, శ్రీ కోదండరామ ఆలయ ట్రస్ట్ చైర్మన్ బీన ఆనంద్,మాజీ ఎంపీపీ చిత్రాడ శ్రీనివాస్, పట్టణ శ్రీసైన సంఘ అధ్యక్షుడు, టిడిపి నేత రెల్ల నారాయణరావు, బిజెపి నేత బీన వంశీ,బాబురావు, లోకనాధం తదితరులు ఉన్నారు.

## బాల్యం నుండే పోటీతత్వం అలవర్చుకోవాలి

### -ఏపీటీపీసీ చైర్మన్ వజ్జ బాబురావు

**పలాస, డిసెంబరు 22(వార్త):** బాల్యం నుండే పోటీతత్వం అలవర్చుకోవాలని రాష్ట్ర ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ వజ్జ బాబూరావు అన్నారు. సోమవారం గణిత శాస్త్రవేత్త శ్రీ శ్రీనివాస రామానుజన్ జయంతి సందర్భంగా బ్రాహ్మణతర్ల మోడల్ ప్రైమరి స్కూల్ లో క్లస్టర్ స్థాయి క్విజ్ పోటీల నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిలుగా రాష్ట్ర ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ వజ్జ బాబూరావు, జిల్లా గ్రంధాలయ చైర్మన్ పీరుకట్ల విఠల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నేటి బాలలే రేపటి భావితరాలకు భవిష్యత్ అని అన్నారు. బాల్యం నుండి చదువుతో పాటు క్రమశిక్షణ అలవర్చుకోవాలన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా సాంకేతికంగా విద్యార్థి దశ నుండే సమాయత్తం అవ్వాలని దృఢ సంకల్పంతో ముందుకు వెళ్లాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వీరితో పాటు తెలుగుదేశం నాయకులు దువ్వాడ శ్రీహర్ష నాయుడు, స్కూల్ కమిటీ చైర్మన్ మోహనరావు, ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ కమిటీ సభ్యులు వడ్డి యాదగిరి, పాఠశాల ప్రధానోపాధ్యాలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు అనంతరం విజేతలకు బహుమతులు ప్రధానం చేశారు.



## ఘనంగా జాతీయ గణిత దినోత్సవం



**పలాస, డిసెంబరు 22(వార్త):** పలాస ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో భారతదేశం గర్వించదగిన గణిత మేధావి, శాస్త్రవేత్త శ్రీనివాస్ రామానుజన్ గారి 136 వ జయంతి సందర్భంగా జాతీయ గణిత దినోత్సవాన్ని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జె. వెంకటలక్ష్మి ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జె. వెంకటలక్ష్మి విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ గణిత శాస్త్రం దైనందిన జీవితంలో పోషిస్తున్న కీలక పాత్రను వివరించి, విద్యార్థులు విశ్లేషణాత్మక ఆలోచన అలవర్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమాన్ని కళాశాల గణిత విభాగానికి చెందిన సునీత మేడం, ప్రసాద్ రావు సమర్థవంతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు శ్రీనివాస్ రామానుజన్ గారి జీవిత విశేషాలు, గణిత శాస్త్రానికి ఆయన చేసిన అమూల్యమైన సేవలు, పరిశోధనాత్మక కృషిని విద్యార్థులకు క్లుప్తంగా వివరించారు.

కార్యక్రమంలో భాగంగా మాథ్స్ మారథాన్ అనే పోటీ పరీక్షను నిర్వహించగా, అందులో ప్రథమ బహుమతి జె. మనీ, ద్వితీయ బహుమతి సుస్మిత, తృతీయ బహుమతి మేఘన అనే విద్యార్థులు గెలుచుకొని నగదు బహుమతులు అందుకున్నారు. ఈ కార్యక్రమంలో హిందీ అధ్యాపకులు డాక్టర్ వెంకటలక్ష్మి, సైన్స్ ఇన్‌చార్జ్ శ్రీనివాస్ పట్నాయక్, అధ్యాపకులు నరసింహులు, ఇతర అధ్యాపకులు, విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## మహిళా సంఘాలకు బ్యాంకుల సహకారం



**మందస, డిసెంబరు 22(వార్త):** పంచ సూత్రాలు పాటిస్తున్న మహిళా స్వయం శక్తి సంఘాలు కూడా లోన్లు గురించి బ్యాంకుల చుట్టూ తిరగాల్సిన అవసరం లేదని, అర్హత గల గ్రూపులకు డిజిటల్ ఎం.సి.పి. ప్రకారం బ్యాంక్ సిబ్బంది మీ గ్రామ సంఘానికి వచ్చి వెరిఫై చేయించి లోన్లు మంజూరు చేస్తామని మందస యూనియన్ బ్యాంక్ మేనేజర్ చక్రధరరావు తెలిపారు. మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో ఏర్పాటుచేసిన క్లస్టర్ కోఆర్డినేటర్లు, వి.ఓ.ఎ.ల శిక్షణ, సమీక్షా కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. సంఘ సభ్యులు ఎవరైనా వారి కుటుంబ ఆదాయాన్ని మెరుగుపరుచుకోవడానికి తీసుకున్న రుణంతో మంచి యాక్టివిటీ యూనిట్ పెట్టదలుచుకుంటే వ్యక్తిగతంగా కూడా సబ్సిడీతో కూడిన రుణాలును కూడా అందిస్తామని తెలిపారు. సేవింగ్ ఖాతాలో ఉన్న నిధులను సంఘం తీర్మానం ప్రకారం ఎప్పుడైనా తీసుకునే అవకాశం ఇస్తామని తెలిపారు. ఏ.పి.ఎం. పైడి కూర్మారావు మాట్లాడుతూ సంఘ సభ్యులకు నిజంగా పొదుపు నుంచి అప్పు వాడుకునే అవసరం లేకపోతే, కనీసం అధిక వడ్డీకి అదే బ్యాంకులో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేయించుకోవాలని సూచించారు. స్వయం సమృద్ధి సాధించాలంటే ప్రతి సంఘం కూడా మొదటగా వారి స్వంత నిధులను సక్రమముగా వినియోగించుకోవాలన్నారు. తరువాత ప్రభుత్వం ఏ విధమైన ప్రాసెసింగ్ చార్జీలు లేకుండా కేవలం 92 పైసలు తక్కువ వడ్డీకే మంజూరు చేయిస్తున్న శ్రీనిధి రుణాలను వినియోగించుకోవాలని తెలిపారు. షెడ్యూల్ కులాలు తెగలకు సంబంధించి అర్హులంతా ప్రభుత్వం వడ్డీ లేకుండా ఇప్పిస్తున్న ఉన్నతి రుణాలను వినియోగించుకోవాలన్నారు. మన స్వయం శక్తి సంఘాల్లో చదువుకొని పని చేసే ఆసక్తి ఉన్న చురుకైన మహిళలకు సి.ఆర్ .పి.లుగా నియమించి పనిచేయడానికి ప్రభుత్వం అవకాశం ఇస్తున్నందున గ్రామాలలో అందరికీ అవగాహన కల్పించి, ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో స్త్రీనిధి మేనేజర్ రాము, అకౌంటెంట్లు కళ్యాణి, కృష్ణకుమారితో సహా మండల మహిళా సమాఖ్య ప్రతినిధులు రవణమ్మ, శారద, శైలజతో పాటు అందరూ క్లస్టర్ కోఆర్డినేటర్లు, వి.వో.ఏ.లు పాల్గొన్నారు.

## పాఠశాలల్లో జాతీయ గణిత దినోత్సవం

**సోంపేట, డిసెంబరు 22(వార్త):** జాతీయ గణిత దినోత్సవం సందర్భంగా పలు పాఠశాలల్లో సోమవారం జాతీయ గణిత దినోత్సవాన్ని నిర్వహించారు. గణిత పితామహుడు శ్రీనివాస రామానుజన్ 139వ జయంతి సందర్భంగా కార్యక్రమాలు చేపట్టారు.

**చొట్రాయిపురంలో....**

కంచిలి మండలం చోట్రాయిపురం గ్రామంలో పాఠశాల ఉపాధ్యాయుడు ప్రముఖ గణిత అవధాని మద్దు తిరుపతిరావు ఆధ్వర్యంలో గణిత దినోత్సవం నిర్వహించారు. రామానుజన్ పుట్టినరోజు తేదీలో అంకెల మొత్తం 79 తో డ్యాన్స్ మ్యాజిక్ చదరం నిర్వహించారు. లింగమూర్తి మాస్టారు తదితరులు పాల్గొన్నారు.

**పెద్ద శ్రీరాంపురంలో...**

కంచిలి మండలం పెద్ద శ్రీరాంపురం గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రిన్సిపాల్ పద్మావతి ఆధ్వర్యంలో గణిత దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎనిమిదో తరగతి విద్యార్థులు వర్గ ఘన పంచమ మూలాలను అలవోకగా చెప్పి అందర్నీ ఆశ్చర్యపరిచారు. ఎంఈఓ సప్పతి శివరాం ప్రసాద్ హాజరై జ్యోతి ప్రజ్వలన చేశారు.

**ప్రభుత్వ జూనియర్ కళాశాలలో...**

సోంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జాతీయ గణిత దినోత్సవం గణిత అధ్యాపకురాలు సంధ్యారాణి ఆధ్వర్యంలో నిర్వహించి విద్యార్థులకు గణిత పితామహుడు రామానుజన్ ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఏ మోహన్ రావు అధ్యాపకులు పాల్గొన్నారు.



## రైతులను మిల్లర్లు దగా చేస్తున్నారు

**మందస, డిసెంబరు 22(వార్త):** రైతులను మిల్లర్లు దగా చేస్తున్నారని, మిల్లర్ల అక్రమాల నుంచి రైతులను కాపాడాలని మహేంద్ర రైతు సంఘం నాయకులు కోరారు. ఈ మేరకు వారు మండల రెవెన్యూ అధికారులకు వినతిపత్రం అందజేశారు. ధాన్యాన్ని మిల్లలకు తీసుకెళ్తుండగా తేమ ఉందన్న నెపంతో 5 నుండి 10కిలోలు అడ్డంగా దోచేసుకుంటున్నారన్నారు. మిల్లర్లు బీజీలు కట్టని కారణంగా దళారీల మోసాల్లో రైతులు పడుతున్నారని, దళారీలు ఇదే అదనుగా మోసం చేస్తున్నారన్నారు. మిల్లర్లతో బీజీలు కట్టించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. అన్లోడింగ్ పేరుతో బస్తాకి 20రూపాయలు, ఒక ట్రాక్టర్ కు 150రూపాయలు. ఒక ట్రాక్టర్ లో 50 బస్తాలుకు మొత్తం 1300 రూపాయలు తీసుకుంటూ మిల్లర్లు రైతులకు చాలా మోసము చేస్తున్నారన్నారు. ఉపాధి హామీ పథకం రైతులకు అనుసంధానం చేయాలని, వర్షాభావ పరిస్థితులు కారణంగా పంటలు పాడవుతున్నాయని, ఉచితంగా బోర్లు ను రైతులకు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమములో మహేంద్ర రైతు సంఘం అధ్యక్షుడు బెస్త కామేశ్వరరావు, దుంపల జానకిరావు, కొవ్వూరు కన్నయ్య, పీరికట్ల దేవేంద్ర, కొర్ల హేమరావుచౌదరి, శిస్టు బాబూజీ తదితరులు పాల్గొన్నారు.



# నిబంధనలకు విరుద్ధంగా పంచాయతీల విభజన

### - మాజీ మంత్రి ధర్మాన కృష్ణదాస్

**నరసన్నపేట, డిసెంబరు 22(వార్త):** జిల్లాలో గ్రామ పంచాయతీల పునర్వ్యవస్థీకరణ ప్రక్రియను నిబంధనలకు విరుద్ధంగా, ఏకపక్షంగా చేపట్టడం సరికాదని మాజీ ఉప ముఖ్యమంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ స్పష్టం చేశారు. ఈ మేరకు సోమవారం నరసన్నపేటలో జిల్లా జాయింట్ కలెక్టర్‌కు ఆయన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ధర్మాన కృష్ణదాస్ మాట్లాడుతూ ప్రభుత్వం ఇటీవల గ్రామ పంచాయతీల విభజనపై నిషేధాన్ని ఎత్తివేస్తూ కొత్త మార్గదర్శకాలను జారీ చేసిందని, అయితే వాటిని సరిగా అమలు చేయకుండా నరసన్నపేట నియోజకవర్గ పరిధిలోని అలుదు, అంధవరం, దరివాడ, బొద్దాం, మడపాం, వి.ఎన్.పురం తదితర గ్రామ పంచాయతీలను విడగొట్టి కొత్త పంచాయతీలు ఏర్పాటు చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. ఈ ప్రక్రియలో స్థానిక సంస్థల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవడం లేదని అన్నారు. ఎన్నికైన పంచాయతీ పాలకవర్గాల తీర్మానాలు లేకుండానే, కేవలం కొంతమంది వ్యక్తులు చేసిన దరఖాస్తుల ఆధారంగా అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేయడం చట్టవిరుద్ధమని ఆయన పేర్కొన్నారు. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన బాడీల ఆమోదం లేకుండా కొత్త పంచాయతీల ఏర్పాటుకు సిఫార్సులు చేయరాదని స్పష్టం చేశారు. నిబంధనల ప్రకారం గ్రామసభలు నిర్వహించి పారదర్శకంగా వ్యవహరించాలని, నిబంధనలకు విరుద్ధంగా పంపే ప్రతిపాదనలకు అనుమతులు మంజూరు చేయవద్దని జిల్లా జాయింట్ కలెక్టర్‌ను కోరారు. ఈ అంశంపై సంబంధిత అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీలు అరంగి మురళీధర్, వాన గోపి, ముద్దాడ బైరాగినాయుడు, రాష్ట్ర రైతు కార్యదర్శి కనపల శేఖరరావు, జిల్లా గ్రీవెన్స్ సెల్ అధ్యక్షుడు రౌతు శంకరరావు, ఆయా గ్రామాల సర్పంచులు, ప్రజాప్రతినిధులు పాల్గొని జాయింట్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.



## పోటీ పరీక్షల్లో పూజితకు ఐదో ర్యాంక్



**జలుమూరు, డిసెంబరు 22(వార్త):** పాతపట్నం మహేంద్ర జూనియర్ కళాశాలలో నిన్న నిర్వహించిన పోటీ పరీక్షల్లో జలుమూరు మండలం ఎంఎస్ఎన్ స్కూల్‌కు చెందిన విద్యార్థిని ఇలపండ పూజిత 2,500 మంది విద్యార్థులలో ఐదో ర్యాంక్ సాధించి ప్రతిభను చాటింది. ఈ సందర్భంగా ఎంఎస్ఎన్ స్కూల్‌లో పూజితను అభినందిస్తూ ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ డైరెక్టర్ ఉప్పాడ ఉమాశంకర్, ప్రిన్సిపాల్ మామిడి సత్యనారాయణ, ఉపాధ్యాయులు సుగుణతో పాటు ఇతర ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొని విద్యార్థిని అభినందించారు. పోటీ పరీక్షల్లో ఉన్నత ర్యాంక్ సాధించడం గర్వకారణమని, భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని వారు ఆకాంక్షించారు. విద్యార్థుల కృషి, ఉపాధ్యాయుల మార్గనిర్దేశం, తల్లిదండ్రుల సహకారం వల్లే ఇలాంటి విజయాలు సాధ్యమవుతాయని వారు తెలిపారు. పూజిత సాధించిన ఈ ఘనతతో ఎంఎస్ఎన్ స్కూల్ ప్రతిష్ఠ మరింత పెరిగిందని పేర్కొన్నారు.

## శ్రీ మహావిష్ణువుకు అష్టాదశ మంగళ హారతులు



**జలుమూరు, డిసెంబరు 22(వార్త):** శ్రీముఖలింగంలో ఉన్న ప్రఖ్యాత శ్రీముఖలింగేశ్వర స్వామి ఆలయంలో క్షేత్ర పాలకుడు శ్రీమహావిష్ణువుకు ఆదివారం రాత్రి అష్టాదశ మంగళ హారతులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ అర్చకులు వేదోక్త విధానంలో పూజలు నిర్వహించగా, ధనుర్మాసం సందర్భంగా ఉదయం నుంచి శ్రీమహావిష్ణువుకు ప్రత్యేక పూజాది కార్యక్రమాలు కొనసాగాయని వారు తెలిపారు. సాయంత్రం వేళ మంగళహారతి కార్యక్రమం ఘనంగా చేపట్టగా, ఆలయ ప్రాంగణం భక్తుల జయజయధ్వానాలతో మార్మోగింది. ఈ సందర్భంగా స్వామివారి దర్శనార్థం పరిసర గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. కార్యక్రమం ప్రశాంతంగా, భక్తి వాతావరణంలో ముగిసిందని ఆలయ వర్గాలు వెల్లడించాయి.

## విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న ఆటో.. ఇద్దరికి గాయాలు



**పోలాకి, డిసెంబరు 22(వార్త):** నరసన్నపేట నుంచి పోలాకికి వెళ్తున్న ఆటో సోమవారం ఉదయం అదుపు తప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీకొనడంతో ఇద్దరు ప్రయాణికులకు గాయాలయ్యాయి. ఈ ప్రమాదం పోలాకి పరిధిలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం, వేగ నియంత్రణ కోల్పోయిన ఆటో రోడ్డుపక్కన ఉన్న కరెంటు స్తంభాన్ని ఢీకొంది. ఈ ఘటనలో ఆటోలో ప్రయాణిస్తున్న యుగందర్, చిన్నమ్ముడుకు గాయాలయ్యాయి. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు వెంటనే స్పందించి క్షతగాత్రులను నరసన్నపేట ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనతో కొంతసేపు రాకపోకలకు అంతరాయం ఏర్పడగా, పోలీసులు ఘటనపై విచారణ చేపట్టినట్లు సమాచారం.

## రాష్ట్ర స్థాయి క్రాస్‌కంట్రీ పోటీలకు ఈదులవలస మోడల్ స్కూల్ విద్యార్థులు



**పోలాకి, డిసెంబరు 22(వార్త):** శ్రీకాకుళం కోడి రామ్మూర్తి స్టేడియంలో ఆదివారం నిర్వహించిన క్రాస్‌కంట్రీ పోటీల్లో పోలాకి ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థులు విశేష ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. పాఠశాల ప్రిన్సిపల్ పైడి ప్రవీణ తెలిపిన వివరాల ప్రకారం, 8వ తరగతి విద్యార్థిని ఝాన్సీ ద్వితీయ స్థానం సాధించగా, 9వ తరగతి విద్యార్థి భరత్ కుమార్ 4వ స్థానం పొందారు. ఈ విజయాలతో ఇద్దరూ రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించారు. ఈ సందర్భంగా సోమవారం పాఠశాల ఆవరణలో ప్రిన్సిపల్ ప్రవీణతో పాటు ఉపాధ్యాయులు, పీడీ ఎం. నీలం విద్యార్థులను అభినందించి, భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

## సారవకోటలో ముగ్గుల పోటీలు

**సారవకోట, డిసెంబరు 22(వార్త):** సారవకోట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం విద్యార్థులకు ముగ్గుల పోటీలు ఉత్సాహంగా నిర్వహించారు. గణిత దినోత్సవాన్ని పురస్కరించుకుని 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థుల కోసం ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు ప్రధానోపాధ్యాయులు రామకృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులు గణిత సూత్రాలు, ఆకృతులు ప్రతిబింబించే విధంగా రంగురంగుల ముగ్గులు వేసి తమ ప్రతిభను చాటుకున్నారు. పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో సృజనాత్మకతతో పాటు గణితంపై ఆసక్తిని పెంపొందిస్తాయని ఉపాధ్యాయులు పేర్కొన్నారు.



## సవర బొంతు పాఠశాలలో గణిత దినోత్సవం



**సారవకోట, డిసెంబరు 22(వార్త):** సవరబొంతు జడ్పీ పాఠశాలలో శ్రీనివాస రామానుజన్ జన్మదినాన్ని పురస్కరించుకుని జాతీయ గణిత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించినట్లు ఎంఈఓ మద్దు వెంకటరమణ తెలిపారు. సోమవారం స్థానిక పాఠశాల ఆవరణలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. గణిత శాస్త్రానికి విశేష సేవలందించి ప్రపంచ ఖ్యాతి పొందిన మహానుభావుడు శ్రీనివాస రామానుజన్ అని కొనియాడారు. విద్యార్థుల్లో గణితంపై ఆసక్తిని పెంపొందించడమే ఈ దినోత్సవ లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులచే పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు గణిత సంబంధిత క్విజ్ పోటీలు నిర్వహించారు. పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, పాఠశాల సిబ్బంది పాల్గొని వేడుకను విజయవంతం చేశారు.

## గణిత శాస్త్ర అభివృద్ధికి రామానుజన్ కృషి




**నరసన్నపేట, డిసెంబరు 22(వార్త):** నరసన్నపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం గణిత శాస్త్ర దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గణిత శాస్త్రానికి విశేష కృషి చేసిన మహనీయుడు శ్రీనివాస రామానుజన్ చిత్రపటానికి కళాశాల ప్రిన్సిపల్ లత పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ గణిత శాస్త్ర అధ్యయనం ద్వారా విద్యార్థుల్లో క్రిటికల్ థింకింగ్, సూక్ష్మ పరిశీలన శక్తి, సమస్యలను విశ్లేషించి పరిష్కరించే సామర్థ్యం పెరుగుతాయని తెలిపారు. గణితం కేవలం సంఖ్యల అధ్యయనం మాత్రమే కాకుండా జీవన నైపుణ్యాలను పెంపొందించే శాస్త్రంగా అభివర్ణించారు. ఈ కార్యక్రమంలో గణిత అధ్యాపకులు పవిత్రతో పాటు అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొని వేడుకను విజయవంతం చేశారు.

## సారవకోటలో శత శాతం పల్స్ పోలియో



**సారవకోట, డిసెంబరు 22(వార్త):** సారవకోట మండలంలో పల్స్ పోలియో కార్యక్రమాన్ని శత శాతం విజయవంతంగా పూర్తిచేసినట్లు వైద్య అధికారులు తెలిపారు. ఆదివారం నిర్వహించిన పల్స్ పోలియో కార్యక్రమానికి ఏ కారణాలతోనైనా హాజరుకాలేని చిన్నారులను గుర్తించి, సోమవారం వైద్య సిబ్బంది ప్రత్యేక చర్యలు చేపట్టారు. మండలంలోని పలు గ్రామాల్లో పోలియో చుక్కలు అందని పిల్లలను గుర్తించి, వారు చదువుతున్న పాఠశాలలకు వెళ్లి పోలియో చుక్కలను వేయించారు. ఒక్క చిన్నారుడూ ఈ కార్యక్రమానికి దూరం కాకుండా ఉండాలనే లక్ష్యంతో వైద్య సిబ్బంది క్షేత్రస్థాయిలో విస్తృతంగా చర్యలు చేపట్టారు. ఈ ప్రత్యేక చర్యలతో సారవకోట మండలంలో పల్స్ పోలియో కార్యక్రమాన్ని శత శాతం పూర్తిచేసినట్లు వైద్యులు వెల్లడించారు. ప్రజల సహకారం, వైద్య సిబ్బంది కృషితో ఈ కార్యక్రమం విజయవంతమైందని వారు పేర్కొన్నారు.

## 'కుడుమా సాయి'ని ఎస్టీ పంచాయతీగా మార్చండి

### -ఐటీడీఏ ప్రాజెక్టు అధికారికి గిరిజనుల వినతి

**మందస, డిసెంబరు 22(వార్త):** బొగాబంద గ్రామ పంచాయతీ పరిధిలో గల కుడుమాసాయిని ఎస్టీ పంచాయతీగా విభజించాలని ఆయా గ్రామాల గిరిజనులు కోరారు. ఈ మేరకు సీతంపేట వెళ్ళి, ఐటీడీఏ ప్రాజెక్టు అధికారికి వినతిపత్రం అందజేశారు. బొగాబంద గ్రామ పంచాయతీని విభజించి కుడుమాసాయి(ఎస్.టి) గ్రామపంచాయితీ ఏర్పాటు చేయాలన్నారు. బొగాబంద గ్రామ పంచాయితీలో సుమారు 6 గ్రామాలు ఉన్నాయని, ఎస్టీ గ్రామాలైన కుడుమాసాయి, డబారుసింగి, గోపాలసాయి, కుమ్మరకుటియా, కొంటాసాయికోలనీ అనే 5గిరిజన గ్రామాలు ఉన్నాయన్నారు. ఈ 5 గ్రామాలను కలిపి కుడుమాసాయి గ్రామం(ఎస్.టి)కేంద్రంగా గ్రామపంచాయితీ ఏర్పాటు చేయాలని కోరారు. కుడుమాసాయి గ్రామానికిచుట్టు ప్రక్కల గల గ్రామాలు గిరిజన గ్రామాలు ఈ గ్రామాలు అన్ని కలిపి సుమారు 753 జనాభా ఉందని, మా గ్రామాలన్ని గిరిజన గ్రామాలు, బొగాబంద గ్రామానికి 10 కిలోమీటర్లు దూరంలో ఉండడంతో పంచాయితీకి రాకపోకలకు చాలా ఇబ్బందిగా ఉందన్నారు. మా గ్రామాలు బొగాబంద గ్రామ పంచాయితీ పరిధిలో ఉండుట వలన మాకు సౌకర్యాలు ఏర్పడుట లేదన్నారు. మా 5 గ్రామాలకు కలిపి కుడుమాసాయి(ఎస్.టి) గ్రామపంచాయితీ ఏర్పాటు చేసినచో, మా గ్రామాలు అభివృద్ధి చెందే అవకాశం కలదన్నారు. గతంలో ముందు పంచాయితీ విభజన చేసినప్పుడు జనాభా చాలకపోవడంతో కాలేదని, ప్రస్తుతం అవసరమైనంత జనాభా ఉన్నదన్నారు. కావున తమరు మాయందు దయతలచి మా 5 గ్రామాలకు కుడుమాసాయి (యస్.టి) గ్రామపంచాయితీ ఏర్పాటు చేసి మా గ్రామాల అభివృద్ధికి సహకరించాలని వారు కోరారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ సవర రాజు, సవర శివ, సవర నీలకంఠం తదితరులు ఉన్నారు.



## గణితానికి శ్రీనివాస రామానుజన్ సేవలు చిరస్మరణీయం



**మందస, డిసెంబరు 22(వార్త):** గణితానికి శ్రీనివాస రామానుజన్ చేసిన సేవలు వెలకట్టలేనివని కొత్తపల్లి ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కూన వేణుగోపాలరావు అన్నారు. జాతీయ గణిత దినోత్సవాన్ని కొత్తపల్లి ఉన్నత పాఠశాల లో ఘనంగా నిర్వహించారు. ముందుగా శ్రీనివాస రామానుజన్ చిత్రపటానికి పూలమాలతో సత్కరించి, ఆయన గణితానికి చేసిన సేవలను విద్యార్థులకు తెలిపారు. అనంతరం స్థానిక గణిత ఉపాధ్యాయుడు గవ్వ భీమారావును ఘనంగా సత్కరించారు. పాఠశాలలో విద్యార్థులచే నిర్వహించిన గణిత ప్రదర్శనను ప్రధానోపాధ్యాయుడు ప్రారంభించిన అనంతరం, ఆయా ప్రదర్శనను ఉపాధ్యాయులు, విద్యార్థులు తిలకించారు. సందర్భంగా పాఠశాల విద్యార్థులకు ఏర్పాటు చేసిన గణిత ప్రతిభా పరీక్షల్లో విజేతలు, గణిత ప్రదర్శనలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతి ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు జి.జానకమ్మ, ఎం.లక్ష్మణరావు, ఎ.అప్పారావు, బి.పాపమ్మ, ఎం.చిత్రసేను, జి.సూర్యనారాయణ, ఎం.దామోదరం, బి.రమేష్ ఇతర పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## లింబుగాంలో ఘనంగా గణిత దినోత్సవం

**మందస, డిసెంబరు 22(వార్త):** భారతదేశ గణిత మేధావి శ్రీనివాస రామానుజన్ జన్మదినాన్ని పురస్కరించుకుని మందస మండలంలోని లింబుగాం మండల పరిషత్ మోడల్ ప్రాథమిక పాఠశాలలో జాతీయ గణిత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మార్పు జగన్మోహన్ రావు చేతుల మీదుగా శ్రీనివాస రామానుజన్ చిత్రపటానికి పూలమాల వేసి, రామానుజన్ చేసిన సేవలను ఉపాధ్యాయులు కొనియాడారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పిన్నింటి కొండలరావు, గున్న రాజు, దున్న మన్మధరావు , పూజారి తాతారావు, అంగన్ వాడీ కార్యకర్త మామిడి కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.




## విద్యార్థులందరికీ అల్పాహారం అందిస్తున్న అర్జునరావు



**కొత్తూరు, డిసెంబరు 22 (వార్త):** కొత్తూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రత్యేక తరగతుల సందర్భంగా 129 మంది విద్యార్థులకు విరామ సమయంలో అల్పాహారం అందించేందుకు దాతలు ముందుకొచ్చారు. కాంట్రాక్టర్ పోగిరి అర్జునరావు స్వచ్ఛందంగా పది రోజుల పాటు విద్యార్థులందరికీ బిస్కెట్ ప్యాకెట్లను అందజేసి సేవామార్గంలో ఆదర్శంగా నిలిచారు. చివరి పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించి ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచే విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందిస్తామని ప్రకటించి విద్యార్థుల్లో పోటీతత్వాన్ని, ఉత్సాహాన్ని పెంపొందించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వం పాఠశాల హెచ్ఎమ్ ఏ. గోవిందరావు, పొగిరి రవి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొని విద్యా సేవలో భాగమైన ఈ సత్కార్యాన్ని అభినందించారు.



## మనసున్న మా రాజులు మీరే..!

### - మందస జమీందారుల వారసుడు విశాల్‌సింగ్ దేవ్‌ను కీర్తించిన వక్తలు.. సన్మానం

**మందస, డిసెంబరు 22(వార్త):** మనసున్న మారాజులు మీరే సార్.. మీరు కట్టించిన విద్యాలయాలు పేదల దేవాలయాలుగా నేడు ఉపయోగపడుతున్నాయి మారాజా.. మీరు చూపిన దారి ఎందరికో మార్గదర్శకంగా నిలుస్తోంది.. అంటూ మందస సంస్థాన జమీందారుల వారసుడైన సీపీ సింగ్ దేవ్ కుమారుడు రాజా విశాల్ సింగ్ దేవ్‌ను కీర్తించారు. మందసకి విచ్చేసిన ఆయన ప్రభుత్వ జూనియర్ కళాశాలను సందర్శించారు. దీంతో రాజా విశాల్ సింగ్ దేవ్ ను మందస జూనియర్ కళాశాలలో ఘనంగా సన్మానించారు. విశాల్ సింగ్ దేవ్ పూర్వీకులైన శ్రీరాజా శ్రీనివాస రాజ మణిదేవ్ హయాంలోనే శ్రీరాజా శ్రీనివాస స్మారక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను నిర్మించారు. ఈ విద్యాలయం ఇటీవల 125ఏళ్ల ఉత్సవాలను జరుపుకొంది. దీంతో ఈ ప్రాంతానికి జమీందారులు చేసిన సేవలను వారు కొనియాడారు. విశాల్ సింగ్ దేవ్ ను దుశ్శాలువను కప్పి, జ్ఞాపికతో సన్మానించారు. ఆయనపై పూలను చల్లి, జూనియర్ కళాశాలకు ఆయన కుటుంబం అందించిన సహాయ, సహకారాలను కీర్తించారు. ప్రిన్సిపాల్ తేజేశ్వరరావు, అధ్యాపకులు రమణమూర్తి, సాప నరేష్ పాల్గొన్నారు.

Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546